# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 17-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:193 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

నారా కుల లోకేశుడు
ప్రారంభము చేసె స్పోర్ట్సు ప్రాంగణమును?.శ్రీ
తారక రాముని పేరిట?
తీరుగ ప్రజలెల్ల మెచ్చ ?.తిరుపతి లోనన్ !!

(తిరుపతిలో శ్రీ నారా లోకేష్ గారు ఎన్టీఆర్ పేరుతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



**చురక**

ప్రజల దామాషాలో
పార్లమెంట్ సీట్ల పెంపు
దక్షిణాది రాష్ట్రాలకు
దండిగా సీట్ల ముంపు.
ఉత్తరాది రాష్ట్రాల
ఉనికి ఆధిపత్యం
రాజ్యమేలే కుతంత్రం
రాజకీయ సత్యం

-వేల్పుల నారాయణ
9440433475



# తెలంగాణపై ఎంపీ తేజస్వి సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించే ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బ్రిటీషర్ల కన్నా నీచమైన రీతిలో వ్యవహరించినట్లు ఆరోపించారు. ఇండియా , పాకిస్థాన్‌ను విడగొట్టినట్లుగా ఆంధ్రా, తెలంగాణను విభజించారని ఎంపీ సూర్య ఆరోపించారు. లోక్‌సభలో ఇవాళ రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశవిభజనతో పోల్చడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

## పెట్టుబడులు పెట్టండి.. అమెరికా పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం



హైదరాబాద్, ఏప్రిల్ 16: అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో మంత్రి శ్రీధర్ బాబు ఈరోజు(గురువారం) సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. TG-iPASS ద్వారా 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ ఎంఈల తో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం.

## బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 16:: బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని, అలాగే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చడం అజ్ఞానమని మంత్రి విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలను సమర్థించే వారు మూర్ఖులని తీవ్రంగా విమర్శించిన ఆయన, తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటుపై అడ్డగోలుగా మాట్లాడితే ఖబడ్దార్ అని ఘాటుగా హెచ్చరించారు.

# 131వ రాజ్యాంగ సవరణ బిల్లు దేశ చరిత్రలోనే గొప్పది: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు.

ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు.

'పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు.

ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయనివ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే. వారు తమ హక్కుల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. తమ శక్తి నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఈ విషయంలో రాజకీయం చేయొద్దు. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు.

తప్పుడు ప్రచారం వద్దు..

'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ రేపు(శుక్రవారం) ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు.

## చెల్పూర్ కేటీపీపీ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం.. భయాందోళనలో స్థానికులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 16: చెల్పూర్ కేటీపీపీ (కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్)లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్ ఆవరణలో నిల్వ ఉంచిన రిజెక్ట్ కోల్ నిల్వల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రత కారణంగా బొగ్గు నిల్వల్లో వేడి పెరిగి ఈ మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో కిలోమీటర్ల మేరకు నల్లని పొగ వ్యాపించింది, దీంతో పరిసర ప్రాంతాల ప్రజల్లో భయాందోళన నెలకొంది.సమాచారం అందుకున్న వెంటనే ప్లాంట్ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు.

## ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు కీలక ఆదేశాలు: స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 16: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన 9 మంది ఎమ్మెల్యేలతో పాటు, స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది.దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు.

గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారనే అర్థం వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే, వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నది వారి ప్రధాన వాదన.ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు, తదుపరి విచారణను వచ్చే నెల (మే) 6వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.

## ఢిల్లీ విమానాశ్రయంలో ఢీకొన్న రెండు విమానాలు.. రెక్కలు ధ్వంసం.. ప్రయాణికులు క్షేమం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమాన ప్రమాదం జరిగింది. రెండు విమానాల రెక్కలు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా ఉన్నట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. ఈ ఘటన గురువారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో జరిగింది. స్పైస్‌జెట్ ఎయిర్‌క్రాఫ్ట్, ఆకాశ ఎయిర్‌లైన్స్ విమానాల మధ్య ఈ ఘటన జరిగింది. స్పైస్‌జెట్ సంస్థకు చెందిన బీ737-700 విమానం టేకాఫ్ అయ్యేందుకు కదులుతుండగా, పక్కనే నిలిచి ఉంచిన ఆకాశ ఎయిర్‌లైన్స్ విమానాన్ని తాకుతూ వెళ్లింది.

ఈ ఘటనలో స్పైస్‌జెట్ విమానం కుడి రెక్క.. ఆకాశ ఎయిర్‌లైన్స్ విమానపు ఎడమ రెక్కను తాకింది. దీంతో రెండు విమానాల రెక్కలు దెబ్బతిన్నాయి. అయితే, ఈ ఘటనలో రెండు విమానాల్లోని ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని అధికారులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే రెండు విమానాల్ని అధికారులు నిలిపివేశారు. ప్రయాణికుల్ని విమానం నుంచి దింపివేశారు. ఈ ఘటనలో తమ క్యూపీ 1406 అనే విమానం దెబ్బతిందని, ప్రమాదం జరిగిన సమయంలో ఆ విమానం నిలిపి ఉందని ఆకాశ సంస్థ తెలిపింది. ఈ విమానం ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సి ఉందని వెల్లడించింది.


ప్రస్తుతం అందరూ క్షేమంగా ఉన్నారని, ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని విమానయాన సంస్థల ప్రతినిధులు తెలిపారు. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని ఆకాశ ఎయిర్‌లైన్స్ సంస్థ తెలిపింది. ఈ ఘటనపై స్పైస్‌జెట్ సంస్థ కూడా స్పందించింది.

# సీబీఎస్‌ఈలో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

**– 450కు పైగా మార్కులతో 103 మంది రికార్డు**



కరీంనగర్, ఏప్రిల్ 16: అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. 500 మార్కులకు గాను 450కు పైగా మార్కులు సాధించిన 103 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో కొత్త రికార్డు సృష్టించారు.ఈ సందర్భంగా అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో నిర్వహించిన సన్మాన సభలో సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళికలు, నాణ్యమైన బోధనతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించడం గర్వకారణమన్నారు.ప్రతిభ కనబరిచిన వారిలో సానీక 494 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. ఆదిత్య 492, ఎం శ్రీహిత, ఏ హర్ష, ఏ శ్రీనితలో 490 మార్కులు సాధించారు. కే ఓం కార్తికేయ, కె అస్మిత, కే అభిజ్ఞ 488 మార్కులు, ఏ స్వరవిస్తృతి 487, ఎం శ్రీగౌరీ 486, కె వర్ధిని 485 మార్కులు సాధించారు. ఉదయశ్రీ, వి అభిరామ్ 484 మార్కులు, కే మోక్ష్, జి సాయి సుశేన్, ఈ ప్రమేష్ రెడ్డి 483 మార్కులు సాధించారు. పలువురు విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో పూర్తి మార్కులు సాధించడం విశేషం.విజయానికి తోడ్పడిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హీమోఫీలియా వ్యాధి నిర్ధారణే చికిత్సకు తొలి మెట్టు

## (17 ఏప్రిల్ "ప్రపంచ హీమోఫీలియా దినం" సందర్భంగా)

రక్తస్రావానికి, రక్తం గడ్డకట్టే (బ్లడ్ క్లాటింగ్) లోపానికి సంబంధించిన రుగ్మతగా హీమోఫీలియాను గుర్తిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 5 లక్షలకు పైగా ప్రజలు ఈ వ్యాధి బారిన పడినట్లు అంచనా. ప్రమాదకరమైన హీమోఫీలియా వ్యాధితో పాటు ఇతర సంబంధిత వారసత్వ రుగ్మతల పట్ల పూర్తి అవగాహన కల్పించడానికి "ప్రపంచ హీమోఫీలియా ఫెడరేషన్" చొరవతో ప్రతి ఏట 17 ఏప్రిల్‌న "ప్రపంచ హీమోఫీలియా దినం" లేదా "వరల్డ్ హీమోఫీలియా డే"ను పాటించుట 1989 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ హీమోఫీలియా దినం ఇతివృత్తంగా "రోగ నిర్ధారణ : చికిత్సకు తొలి మెట్టు" అనబడే అంశాన్ని తీసుకోని అవగాహన కల్పిస్తున్నారు. ప్రపంచ హీమోఫీలియా ఫెడరేషన్ అనే సంస్థను స్థాపించిన "ఫ్రాంక్ స్నాబెల్" పుట్టిన రోజు 17 ఏప్రిల్‌న ప్రపంచ ప్రపంచ హీమోఫీలియా డే" పాటిస్తున్నాం. హీమోఫీలియా వ్యాధికి చికిత్సగా రక్తమార్పిడి పద్ధతిని పాటిస్తున్నారు.

### హీమోఫీలియా అంటువ్యాధి కాదు:

హీమోఫీలియా అంటువ్యాధి కానప్పటికీ హీమోఫీలియా సమస్యాగ్నికి ఆజ్యం పోస్తున్నాయి కరోనా లాంటి విపత్తులు. చిన్న గాయం అయినపుడు రక్తం కారడం, కొద్ది సేపటికి గడ్డకట్టడంతో రక్తస్రావం ఆగిపోయి ఆరోగ్యం సమకూరడం జరుగుతుంది. హీమోఫీలియా రుగ్మత కలిగిన వ్యక్తులకు గాయం అయినపుడు రక్తం గడ్డకట్టకుండా రక్తస్రావం కొనసాగి ప్రాణాంతక పరిస్థితి కూడా వస్తుంది. రక్తం గడ్డకట్టే లక్షణాలను విశ్లేషించి హీమోఫీలియాను ఏ, బి రకాలుగా వర్గీకరిస్తారు. ప్రతి 5,000 మందిలో ఒక్కరికి హీమోఫీలియా–ఏ, ప్రతి 20,000 మందిలో ఒక్కరికి హీమోఫీలియా–బి రుగ్మతలు కనిపిస్తాయి. దాదాపు 80 శాతం హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు ఈ రుగ్మత ఉందని కూడా తెలియకపోవడం విచారకరం. గాయం అయినపుడు రక్తం గడ్డకపోవడం ప్రమాదకరం అని తెలుసుకోవాలి. హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు అంతర్గత గాయాలు అయినపుడు రక్తస్రావం జరిగి మెదడు, కీళ్ళు, కండరాల్లోకి రక్తం చేరి ప్రాణాలు కూడా పోవచ్చని తెలుసుకోవాలి.

భారతంలో దాదాపు 2 లక్షల హీమోఫీలియా రోగులు ఉన్నట్లు, ఇందులో కేవలం 20,000 మందికి మాత్రమే ఈ వ్యాధి ఉందని తెలుసు. నేటికీ హీమోఫీలియా రుగ్మతకు సరైన చికిత్స అందుబాటులో లేకపోవడం సోచనీయం. అనువంశికంగా జీన్ మ్యుటేషన్ కారణంగా తల్లి నుండి పిల్లలకు సంక్రమించగల హీమోఫీలియా వ్యాధి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండడం కనీస అవసరంగా భావించాలి. గ్రామీణ ప్రజలకు హీమోఫీలియా ఒక శాపంగా మారడం, అంతర్గత/బాహ్య గాయాలు అయిన సందర్భాల్లో పరిస్థితి విషమించి ప్రాణాలు కూడా పోవచ్చని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. సరైన చికిత్స లేని వ్యాధులకు అవగాహనే ఔషధంగా పని చేస్తుంది, ప్రాణాపాయం నుంచి కాపాడుతుంది.



–మధుపాళీ
9949700037

# ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి....

**–టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి.**

**–అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు....**

**–జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.**

సంగారెడ్డి, ఏప్రిల్ 16(నేటి నిజం ప్రతినిధి ) ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కంది మండలంలోని రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు.

కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు.

ఈ సందర్భంగా రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్‌బుక్కులు, సన్నబియ్యం పంపిణీ, వైద్య సేవలు తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ వంటి నూతన పథకాలపై అవగాహన కల్పించారు.

కొందరు లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలను వెల్లడిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు




తెలిపారు.

ఈ సందర్భంగా, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి కుటుంబానికి చేరేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులకు రైతు భరోసాతో పాటు వ్యవసాయ యంత్రాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తు న్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నామన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, మార్చి 6 నుంచి ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదన్నారు. ఇప్పటికే శానిటేషన్, ఆరోగ్య కార్యక్ర మాలు నిర్వహించామని, ఏప్రిల్ 2న గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ వారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి గ్రామం లో పోలీస్ శాఖతో కలిసి రోడ్డు భద్రత పై అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలని సర్పంచులకు సూచించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడటం సర్పంచుల బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలో సివిల్ సప్లైస్ ద్వారా మూడు నెలల రేషన్ పంపిణీ జరుగుతోందని, ఇప్పటికే 80 శాతం ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, అందుకు సర్పంచులు, ఎస్ హెచ్ జి మహిళలు సహకరించాలని కోరారు.

ఈజీఎస్ కింద చేపట్టిన పాఠశాలల్లో మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్, గ్రామ పంచాయతీ, అంగన్వాడి కొత్త భవనాల పనులు వచ్చే రెండు నెలల్లో పూర్తి చేసేలా ఆయా సర్పంచులు చొరవ చూపాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిఐసి జిఎం తుల్జా నాయక్ , ఎంపీడీవో శ్రీనివాస్ , తహసిల్దార్ రవికుమార్ ,ఎంపీఓ మహేందర్ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళలు, రైతులు, మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ నిద్ర మత్తే ఘోర ప్రమాదానికి కారణం

**–ఎస్పీ విక్రాంత్ పాటిల్..**

**–పర్మిట్ లేకుండా నడిచిన వాహనం**

**–నిర్లక్ష్యం బలితీసిన ప్రాణాలు..**

కర్నూలు, ఏప్రిల్ 16: మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో ఇటీవల చోటుచేసుకున్న ఘోర రోడ్డు



ప్రమాదానికి డ్రైవర్ నిద్ర మత్తే ప్రధాన కారణమని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. ప్రమాద స్థలాన్ని స్వయంగా పరిశీలించిన ఆయన, ఘటనకు దారితీసిన పరిస్థితులను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో మాట్లాడిన ఎస్పీ, బొలెరో వాహనం డ్రైవర్ నిద్ర మత్తులో వాహనాన్ని కుడివైపుకు మళ్లించడంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు.

తెల్లవారుజామున ప్రయాణం, దీర్ఘకాల డ్రైవింగ్ వల్ల డ్రైవర్ అప్రమత్తత కోల్పోయి ప్రమాదానికి గురయ్యాడని ఆయన వివరించారు. ఇంకా విచారణలో వెలుగులోకి వచ్చిన మరో కీలక అంశం ఏమిటంటే, ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం సరైన పర్మిట్ లేకుండానే నడుస్తున్నట్లు గుర్తించామని ఎస్పీ తెలిపారు. ఇది రవాణా నిబంధనలపై నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో రోడ్డు భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రాత్రి, తెల్లవారుజామున జరిగే ప్రయాణాల్లో డ్రైవర్ల అలసట, నిద్ర మత్తు ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

దీర్ఘ ప్రయాణాల ముందు తగిన విశ్రాంతి తీసుకోవడం, అవసరమైతే డ్రైవర్ మార్పిడి చేయడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. అలాగే పర్మిట్ లేకుండా వాహనాలను నడపడం, రవాణా నిబంధనలను పట్టించుకోకపోవడం కూడా ప్రమాదాలకు దోహదం చేస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. ఇటువంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. మంత్రాలయం మార్గంలో తరచూ జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, తనిఖీలు మరింత కట్టుదిట్టం చేయాలని నిర్ణయించినట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

ప్రమాదకర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తంగా ఈ ప్రమాదం మరోసారి ఒక కీలక అంశాన్ని స్పష్టం చేస్తోంది. డ్రైవర్ అప్రమత్తత కోల్పోతే క్షణాల్లోనే ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. రవాణా నిబంధనలు పాటించడం, సరైన విశ్రాంతితో డ్రైవింగ్ చేయడం ద్వారానే ఇలాంటి విషాదాలను నివారించగలమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# పంజాబ్‌లోని ఫతేగర్ సాహిబ్ జిల్లాలో జరిగిన దుర్ఘటనపై విచారం వ్యక్తం చేసిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:పంజాబ్‌లోని ఫతేగర్ సాహిబ్ జిల్లాలో జరిగిన దుర్ఘటన పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతగానో బాధించిందని ప్రధాని అన్నారు. తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రధానమంత్రి కార్యాలయం చేసిన పోస్టు "పంజాబ్‌లోని ఫతేఘర్ సాహిబ్ జిల్లాలో జరిగిన దుర్ఘటన గురించి విని చాలా బాధపడ్డాను.

# కృత్రిమ మేధ కేవలం సాంకేతిక విప్లవం మాత్రమే కాదు.. అది ఒక మానవ విప్లవం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:నేడు న్యూఢిల్లీలో జరిగిన ఐఐపీఏ 72వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన "సుపరి పాలన కోసం కృత్రిమ మేధ" అంశంపై 5వ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ వార్షిక స్మారక ఉపన్యాసం ఇచ్చారు.

డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు ఘన నివాళులు అర్పిస్తూ... ఆయన నైతిక విలువలను, దృఢ సంకల్పాన్ని ఉపరాష్ట్రపతి కొనియాడారు. అప్పటి కాలంలోని ప్రముఖ నాయకుల నుంచి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాజేంద్ర ప్రసాద్ వెనకడుగు వేయకుండా సోమనాథ్ ఆలయాన్ని సందర్శించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాజేంద్ర ప్రసాద్ నిరాడంబరత, నిజాయితీ, ప్రజా సేవ పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నిజమైన పాలన అంటే అధికారం చలాయించడం కాదని, ప్రజలకు సేవ చేయడమేనని ఆయన జీవితం నిరూపించిందని చెప్పారు. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడిగా, భారత తొలి రాష్ట్రపతిగా సేవలందించిన ఆయన పేరు మీద ఈ ఉపన్యాస కార్యక్రమం నిర్వహించడం ఎంతో గౌరవమని కొనియాడారు.

ప్రస్తుతం ప్రపంచం మానవ చరిత్రలోనే అత్యంత ఉత్సాహభరితమైన దశలో ఉందని, మనం కృత్రిమ మేధ యుగంలో జీవిస్తున్నామని ఉపరాష్ట్రపతి అన్నారు. యంత్రాలు నేర్చుకోగలవు, వ్యవస్థలు ఆలోచించగలవు అనే స్థితికి చేరుకున్నామన్నారు. పాలన రంగాన్ని కృత్రిమ మేధ సరికొత్తగా మారుస్తోందని, ప్రభుత్వాలకు ఇది ఒక అద్భుత శక్తి వంటిదని ఆయన అభివర్ణించారు. దీనివల్ల ప్రజల అవసరాలను అర్థం చేసుకోవడం, స్పందించడం, గతంలో కంటే మెరుగ్గా సేవలు అందించడం సాధ్యమవుతుందన్నారు. పాలన అంటే కేవలం నియమాలు, వ్యవస్థలకు మాత్రమే కాదని, ప్రజలకు సాధికారత కల్పించడం, ఎవరూ వెనకబడిపోకుండా చూడటమే అసలైన లక్ష్యమని. దానిని సాధించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

2047 నాటికి వికసిత్ భారత్ దిశగా సాగే ప్రయాణంలో కృత్రిమ మేధ కీలక సాధనమని ఉపరాష్ట్రపతి అభివర్ణించారు. దీని వల్ల పాలన మరింత వేగంగా, తెలివిగా, పారదర్శక సమాచారంతో సాగుతోందని ఆయన పేర్కొన్నారు. అత్యంత వెనకబడిన వారికి కూడా ప్రభుత్వ సేవలు ఎంతో గౌరవప్రదంగా, కచ్చితత్వంతో అందేలా ఏఐ వీలు కల్పిస్తోందని.. దీనివల్ల లబ్ధిదారులకు నేరుగా ఫలాలు అందుతాయని చెప్పారు. దీంతో అవినీతి లేదా వృథాను తగ్గించ డం ద్వారా సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ దార్శనికత బలోపేతం అవుతుందని తెలిపారు. విధానాలకు, ప్రజలకు మధ్య ఏఐ ఒక వారధిలా పనిచేస్తుందని, ప్రజా సేవల పంపిణీని మెరుగుపరుస్తుందని అన్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రజలకు ప్రభుత్వ సంస్థల మీద నమ్మకం పెంచడానికి ఇది తోడ్పడుతుందని తెలిపారు.

కృత్రిమ మేధ రంగంలో పురోగతిని ప్రస్తావిస్తూ.. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో సమ్మిళిత పాలన కోసం ఏఐని ఉపయోగించడంలో మన దేశం ప్రపంచంలోనే ముందంజలో ఉందని ఉపరాష్ట్రపతి చెప్పారు. భారత్ వంటి విభిన్న భాషలున్న దేశంలో ఏఐ ఆధారిత వేదికలు భాషాపరమైన అడ్డంకులను అధిగమిస్తున్నాయని పేర్కొన్నారు. పార్లమెంటు పత్రాలు ఇప్పుడు కృత్రిమ మేధ ద్వారా అనేక భారతీయ భాషల్లో అందుబాటులోకి రావడం గర్వకారణమని చెప్పారు. సమ్మిళిత పాలన, భాషా సాధికారత దిశగా భారత్ కు చెందిన ఏఐ ఆధారిత భాషా వేదిక అయినటువంటి భాషిణి ఒక గొప్ప చర్యగా ఆయన కొనియాడారు.

వివిధ రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం గురించి ఉపరాష్ట్రపతి వివరించారు. ఆరోగ్య రంగంలో ఏఐ సహాయక టీబీ స్క్రీనింగ్, పోర్టబుల్ ఎక్స్–రే పరికరాలు, ఈ–సంజీవని వంటి టెలిమెడిసిన్ వేదికలు విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయని ఆయన అన్నారు. దీనివల్ల వైద్యం అందుబాటుకు దూరం అనేది ఇకపై ఒక అడ్డంకి కాబోదని చెప్పారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, సైబర్ భద్రత, న్యాయవ్యవస్థ, పరిపాలనా వ్యవస్థల్లో కూడా ఇలాంటి మార్పులే కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. పాలన ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తున్నట్లే.. ఇప్పుడు ఏఐ కూడా ప్రతి రంగంపై తన ప్రభావాన్ని చూపుతోందని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు.

ప్రపంచంలోని అగ్ర దేశాల సరసన భారత్ చేరిందని.. ముఖ్యంగా ఏఐ అభివృద్ధిలో మన దేశం ఉన్నత స్థానంలో నిలిచిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. దేశంలోని సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇండియా ఏఐ మిషన్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ వంటి కీలక పథకాలను ఆయన ప్రస్తావించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు భారత్ నాయకత్వం వహించడంపై ప్రపంచ గుర్తింపు లభించిందని, భారత ఏఐ సామర్థ్యంపై అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలు పూర్తి నమ్మకాన్ని వ్యక్తం చేశారని తెలిపారు.

కృత్రిమ మేధ వంటి కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని యువత, నిపుణులకు ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. కంప్యూటర్లు వచ్చిన కొత్తలో ప్రజల్లో ఉన్న అపోహలను గుర్తు చేస్తూ.. సాంకేతికత అనేది ఎప్పుడూ కొత్త అవకాశాలను సృష్టిస్తుందని, ప్రజలను శక్తిమంతులను చేస్తుందని చెప్పారు. ఏఐ రంగంలో నైపుణ్యం ఉన్న శ్రామిక శక్తిని నిర్మించడం ముఖ్యమని అన్నారు. స్కిల్ ఇండియా డిజిటల్ హబ్, జాతీయ విద్యా విధానం, యువ ఏఐ వంటి కార్యక్రమాలు భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా యువతను సిద్ధం చేస్తున్నాయని వివరించారు.

కృత్రిమ మేధ వినియోగంలో నైతికత గురించి మాట్లాడుతూ.. ప్రతి సాంకేతిక శక్తి బాధ్యతాయుతంగా ఉండాలని ఉపరాష్ట్రపతి హెచ్చరించారు. కృత్రిమ మేధ అనేది ఎల్లప్పుడూ నిష్పక్షపాతంగా, జవాబుదారీతనంగా, నైతిక విలువలతో కూడి ఉండాలని, అప్పుడే అది మానవాళికి మేలు చేస్తుందని స్పష్టం చేశారు.

ఏఐ కేవలం సాంకేతిక విప్లవం మాత్రమే కాదని, అది ఒక మానవ విప్లవమని ఉపరాష్ట్రపతి అభివర్ణించారు. సుపరిపాలన కోసం కృత్రిమ మేధను ఒక శక్తిగా వాడుకోవాలని, తద్వారా న్యాయమైన, సమ్మిళితమైన, కరుణతో కూడిన సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. మెరుగైన భవిష్యత్తు కోసం వివేకంతో, బాధ్యతతో ఈ మార్పునకు నాయకత్వం వహించాలని అందరినీ కోరారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, ఐఐపీఏ కార్యనిర్వాహక మండలి చైర్మన్ డాక్టర్ జితేంద్ర సింగ్, ఐఐపీఏ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సురేంద్ర కుమార్ బగ్దేతో పాటు ఇతర ప్రముఖులు, అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీహార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం స్వీకరించిన శ్రీ విజయ్ కుమార్ చౌధరిని, శ్రీ బిజేంద్ర ప్రసాద్ యాదవ్‌ని కూడా అభినందించిన ప్రధాని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :బీహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం స్వీకరించిన శ్రీ సమ్రాట్ చౌధరిని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు.

శ్రీ సమ్రాట్ చౌధరి శక్తి, ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న అంకితభావంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం రాష్ట్రానికి అత్యంత ప్రయోజనాన్ని అందిస్తాయని ప్రధానమంత్రి అన్నారు. శ్రీ చౌధరి సమర్థ నాయకత్వంలో బీహార్ రాష్ట్రం, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ, సర్వతోముఖ అభివృద్ధిలో సరికొత్త శిఖర స్థాయిలకు చేరుకోగలదన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు.

బీహార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం స్వీకరించిన శ్రీ విజయ్ కుమార్ చౌధరికి, శ్రీ బిజేంద్ర ప్రసాద్ యాదవ్‌కి కూడా ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు.

వారి క్షేత్రస్థాయి అనుభవం, ప్రజా సంక్షేమం పట్ల వారికి ఉన్న నిబద్ధత బీహార్ అభివృద్ధికి ఒక కొత్త దిశను, జోరును అందిస్తాయన్న నమ్మకాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. సుపరిపాలనలో, పారదర్శకతలో, ప్రజాసంక్షేమంలో బీహార్ నూతన ప్రమాణాలను నెలకొల్పుతుందని కూడా ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధాని రెండు సందేశాలను పొందుపరుస్తూ "బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకరించిన సందర్భంగా సమ్రాట్ చౌధరి గారికి అనేకానేక అభినందనలతో పాటు శుభాకాంక్షలు.

# అగ్ని ప్రమాదాలపై విస్తృత అవగాహన




విజయవాడ, ఏప్రిల్ 16: అగ్నిమాపక వారోత్సవాలు మూడవ రోజు గ్యాస్ గోదాములు, అపార్ట్‌మెంట్లలో విస్తృత అవగాహన కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక శాఖ నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం కీలకమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమైనది. అగ్నిమాపక సిబ్బంది జనవాసాలు ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని ప్రధాన ఎల్పీజీ గ్యాస్ గోదాములను సందర్శించి, అక్కడ భద్రతా ప్రమాణాలను పరిశీలించారు.

గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు అనుసరించాల్సిన అత్యవసర పద్ధతులను సిబ్బందికి యాజమాన్యానికి వివరించారు. రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో మాక్ డ్రిల్: బహుళ అంతస్తుల భవనాలలో నివసించే ప్రజలకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. అపార్ట్‌మెంట్లలోని ఫైర్ హైడ్రెంట్ సిస్టమ్స్, ఫైర్ ఎక్స్‌టింగ్యూషర్లను ఎలా వినియోగించాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. ముఖ్యంగా వంటగదిలో గ్యాస్ స్టౌలు, రెగ్యులేటర్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షార్ట్ సర్క్యూట్‌లను నివారించే మార్గాలను వివరించారు. ప్రమాదాల నివారణకు సంబంధించిన సూచనలు, అత్యవసర నంబర్లు (101) కలిగిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాల నివారణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఆస్తి, ప్రాణ నష్టాలను అరికట్టగలం" అని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

# దళిత రత్న అవార్డు అందుకున్న కలకొండ యాదగిరి



హైదరాబాద్, ఏప్రిల్ 16: హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అలుపెరుగని పోరాటాలల్లో కీలకపాత్ర పోసించి మాదిగలకు చేసిన సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళిత నాయకులకు దళితుల కోసం విశిష్ట సేవలు అందించిన వారికి దళితరత్న అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం మాడుగుల మండలం నల్లవారి పల్లి గ్రామం చెందిన ఎం ఆర్ పి ఎస్ (ఓఖీఖూ)నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు కలకొండ యాదగిరి మాదిగ కు ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య ఆధ్వర్యంలో ఉద్యమంలో పాల్గొని చేసిన సేవలను గుర్తించి దళిత రత్న అవార్డు అందజేయడం జరిగిందని అన్నారు.

ఈ సందర్భంగా కలకొండ యాదగిరి మాట్లాడుతూ దళిత రత్న అవార్డు రావడానికి సహకరించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు టైగర్ మేడి పాపయ్య,ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ గంట సుదర్శన్ కి రాష్ట్ర నాయకులకు మండల నియోజకవర్గ ఇన్చార్జిలకు అధ్యక్షులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# మీ ఇంటి నుంచే ఇంటి వివరాలు నమోదు చేయండి..

విజయవాడ, ఏప్రిల్ 16: దేశంలో మొట్టమొదటి డిజిటల్ జన గణన తొలిదశలో భాగంగా ప్రారంభమైన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్ – ఎస్ఈ)లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఇంటి నుంచే సమాచారాన్ని నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కోరారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్వీయ గణన జరగనున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించారు.

ఈ స్టాల్ ద్వారా ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేషన్‌పై అవగాహన కల్పించనున్నారు. కచ్చితమైన డేటాతో పాటు కీలకమైన జనగణనలో విస్తృత ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు వివరించారు. https://se.census.gov.in ని పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను పొందుపరుచుకోవచ్చన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ వల్ల సమయం ఆదా అవడంతో పాటు కచ్చితమైన డేటా పొందేందుకు వీలుంటుందన్నారు.

34 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిన అనంతరం ప్రివ్యూ చేసుకొని, ఫైనల్‌గా సబ్‌మిట్ చేయాలన్నారు. ఆ సమయంలో హెచ్ అక్షరంతో మొదలయ్యే 11 అంకెల విశిష్ట సంఖ్య (ఎస్ఈ ఐడీ) జనరేట్ అవుతుందని.. భవిష్యత్తులో గణాంక సిబ్బంది (ఎన్యూమరేటర్) వచ్చినప్పుడు ఎస్ఈ ఐడీని వారికి చూపించడం ద్వారా డేటా ధ్రువీకరణ పూర్తవుతుందని తెలిపారు. అదే విధంగా ఈ నెల 30 వరకు 15 రోజుల అవుట్‌రీచ్ క్యాంప యిన్ లో భాగంగా ఒక్కోరోజు ఒక్కో వర్గం లక్ష్యంగా స్వీయ గణనపై ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

స్వీయ గణనలో ప్రజలందరూ పాల్గొని జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జేసీ ఇలక్కియ కోరారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో టీవీ సతీష్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌రెడ్డి, మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.వెంకట రామయ్య, సీపీవో వై.శ్రీలత, సెన్సస్ మాస్టర్ ట్రైనర్ డా. కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక మాండ్యలోని శ్రీ క్షేత్ర ఆదిచుంచనగిరిలో శ్రీ గురుభైరవైక్య మందిరాన్ని ప్రారంభించిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:కర్ణాటకలోని మాండ్య జిల్లా శ్రీ క్షేత్ర ఆదిచుంచనగిరిలో శ్రీ గురు భైరవైక్య మందిరాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసిందన్న ప్రధానమంత్రి... వైభవోపేతంగా శ్రీ గురు భైరవైక్య ఆలయాన్ని ప్రారంభించి, మహోన్నతులైన సాధుసంతులతో సంభాషించే భాగ్యాన్ని తనకిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రక జ్వాలా పీఠం వద్ద సమయం గడపడం, అశేషంగా తరలివచ్చిన భక్తులనుద్దేశించి ప్రసంగించడం మాటలకందని బలమైన భావోద్వేగాలను కలిగించాయన్నారు. “ఈ దైవిక అనుభవాలు శాశ్వతంగా నా స్మృతిపథంలో నిలిచిపోతాయి” అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... తత్వజ్ఞానం, తంత్రజ్ఞానం మేళవించిన విశిష్ట ప్రాంతంగా కర్ణాటక ప్రత్యేకతను సంతరించుకున్నదని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. చక్కెర నగరమైన మాండ్యా ప్రజల ఆతిథ్యాన్ని, ఆదరణ భావాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. శ్రీ ఆదిచుంచనగిరి మహా సంస్థాన మఠం వంటి సంస్థలు ఈ ప్రాంతానికి నైతిక, ఆధ్యాత్మిక దిక్సూచిగా నిలుస్తాయన్నారు. “ఈ కర్ణాటక నేల గంభీరమైన తాత్వికతను, ఆధునిక సాంకేతికత శక్తిని పరిపూర్ణంగా మేళవించింది” అని శ్రీ మోదీ అభివర్ణించారు.

భారత నాగరికత అత్యంత శక్తిమంతమైనదని, లక్షల ఏళ్ల చరిత్ర మనకుందని ప్రధాన మంత్రి అన్నారు. శ్రీ ఆదిచుంచనగిరి మఠం 2000 ఏళ్ల చరిత్రలో అవిచ్ఛిన్నమైన సంప్రదాయ పరంపర ఉందని, ఈ నిరంతరత అత్యంత అరుదైనదని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బాలగంగాధరనాథ మహాస్వామిజీ వంటి మహనీయుల ప్రగాఢమైన ఆధ్యాత్మిక మార్గనిర్దేశాన్ని ఆయన కొనియాడారు. ఆ వారసత్వాన్ని నవోత్తేజంతో ముందుకు తీసుకెళ్తున్న ప్రస్తుత సారథులను అభినందించారు. “తరతరాలుగా సేవాభావంతో ఈ పవిత్ర సంస్థ మన భూమిని పావనం చేస్తోంది” అని ప్రధానమంత్రి మోదీ అన్నారు.

సమాజ పరివర్తనలో మహోన్నతులైన సాధుసంతుల పాత్రను వివరిస్తూ... సామాన్యులు, గ్రామీణ యువత కష్టాలను పరిష్కరించడంలోనే డాక్టర్ బాలగంగాధరనాథ మహాస్వామిజీ ఆధ్యాత్మిక శక్తి నిక్షిప్తమై ఉందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. భక్తి అంటే బాధ్యతల నుంచి తప్పించుకోవడం కాదని, ప్రజల అభ్యున్నతి దిశగా క్రియాశీల బాధ్యతను స్వీకరించడమేనంటూ... భక్తి భావనపై ఆ మహానుబావుడి దృక్కోణాన్ని శ్రీ మోదీ వివరించారు. “సమాజ శ్రేయస్సు కోసం బాధ్యతాయుతంగా ముందడుగు వేయడమే నిజమైన భక్తి” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

మహాస్వామిజీ చేపట్టిన విస్తృతమైన ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రధానమంత్రి వివరించారు. నిరుపేద పిల్లల కోసం ప్రాథమిక విద్య నుంచి వృత్తి విద్యా కోర్సుల వరకు ఉచితంగా అందించే అనేక విద్యా సంస్థలను ఈ మఠం స్థాపించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆరోగ్య రంగంలో మఠం అనుసరిస్తున్న దూరదృష్టితో కూడిన విధానం వల్ల... ఎలాంటి వివక్ష లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందరికీ చేరువవుతున్నాయన్నారు. “నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండడం ప్రజలందరి హక్కు. అది కేవలం కొందరికే పరిమితమైన సదుపాయం కాదు” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

మఠం చేపడుతున్న మానవతా చర్యలకు, ప్రభుత్వ సంక్షేమ విధానాలకు నడుమ సారూప్యతను ప్రధానమంత్రి వివరించారు. కోట్లాది నిరుపేదలకు ఉచిత వైద్య చికిత్సలనందిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విజయవంతమైన తీరును ఆయన ఉదాహరించారు. ఇటీవల ఈ పథకాన్ని మరింత విస్తరిస్తూ.. 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరినీ దీని పరిధిలోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. “మన పెద్దలకు అవసరమైన ఆరోగ్య సదుపాయాలను అత్యంత గౌరవప్రదమైన రీతిలో వారికి అందించాలని మేం నిశ్చయించుకున్నాం” అని ఆయన పునరుద్ఘాటించారు.

సమస్త జీవరాశిపైనా మహాస్వామిజీకి గల అపారమైన కారుణ్యాన్ని ప్రస్తావిస్తూ... నెమళ్ల సంరక్షణ కోసం అంకితభావంతో ఆయన చేపట్టిన సామాజిక ఉద్యమాన్ని ప్రధానమంత్రి కొనియాడారు. పర్యావరణ పరిరక్షణతోపాటు, దేశ సాంస్కృతిక వారసత్వంతోనూ ఈ ఉద్యమం ముడిపడి ఉందన్నారు. ఢిల్లీలోని నివాసంలో తన పరిశీలనలను ప్రజల ముందుంచారు. జాతీయ పక్షితో తనకున్న ఆత్మీయానుబంధాన్ని వారితో పంచుకున్నారు. “నెమలి మన దేశానికి గర్వకారణం మాత్రమే కాదు... అది అత్యంత అందమైన, శాంతియుతమైన జీవి” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ప్రస్తుత జగద్గురువు డాక్టర్ నిర్మలానందనాథ మహాస్వామిజీ సేవలను కొనియాడారు. గురువు అడుగుజాడల్లో విధేయుడై నడుస్తూ... ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులను తేవడంలో ఆయన అంకితభావాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. కొత్తగా నిర్మించిన శ్రీ గురు భైరవైక్య మందిరం కేవలం ఒక భౌతిక నిర్మాణం మాత్రమే కాదని, అచంచలమైన ఆధ్యాత్మిక శక్తికి అది సజీవ రూపమని అభివర్ణించారు. “నిస్సందేహంగా ఈ ఆలయం సేవకు, స్ఫూర్తికి శాశ్వత దిక్సూచిగా నిలుస్తుంది” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఆహారం, విద్య, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, కరుణ వంటి అంశాలను మేళవిస్తూ.. శ్రీ ఆదిచుంచనగిరి మఠం పాటిస్తున్న తొమ్మిది మూల సూత్రాలను ప్రధానమంత్రి వివరించారు. వీటి స్ఫూర్తితో ఒక సమష్టి జాతీయ తీర్మానాన్ని ఆయన ప్రతిపాదించారు. సామాజిక ప్రయోజనమున్న తొమ్మిది నిర్దిష్ట రంగాలపై దృష్టి సారించడం ద్వారా, ఈ విలువలను అందిపుచ్చుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. “మన సమష్టి బలోపేతం చేసేలా, తొమ్మిది కీలక విజ్ఞాపనలను ఈ రోజు మీ ముందు పెడుతున్నాను” అని శ్రీ మోదీ చెప్పారు.

మొదటి ఐదు విజ్ఞప్తులను వివరిస్తూ... జల సంరక్షణను ఒక ఉద్యమంగా చేపట్టాలని, ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని మాండ్య ప్రజలకు ప్రధానమంత్రి కోరారు. అన్ని బహిరంగ, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో స్వచ్ఛతను కాపాడాలని విన్నవించారు. అలాగే భారతీయ ఉత్పత్తులను ఆదరించడం ద్వారా స్వావలంబనపై దృష్టి సారించాలని, అద్భుతమైన దేశ సౌందర్యాన్ని ఆస్వాదించేలా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని అభ్యర్థించారు. “మనం భూమాతను కాపాడుకోవాలి. క్రియాశీలంగా వ్యవహరిస్తూ మన దేశీయ పరిశ్రమలను బలోపేతం చేయాలి” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఆరోగ్యం, వ్యవసాయ రంగాల ప్రాధాన్యాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని అవలంబించాలని కోరారు. శ్రీ హెచ్.డి. దేవెగౌడ ప్రాచుర్యంలోకి తెచ్చిన, ఈ ప్రాంత ప్రధాన ఆహారమైన రాగి వంటి ద్దతో పాటు చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని యువతను కోరారు. ఊబకాయాన్ని ఎదుర్కొనేందుకు వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని, దేహదారుఢ్యాన్ని దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని కోరారు. “యోగా, ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యమివ్వడం మన దైనందిన జీవితానికి అత్యావశ్యకం” అని శ్రీ మోదీ అన్నారు.

అభాగ్యులకు సేవచేయడం జీవితానికి గొప్ప సార్థకతను చేకూరుస్తుందని, సామాజిక నిర్మాణాన్ని బలోపేతం చేస్తుందని చెబుతూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. ఈ తొమ్మిది అభ్యర్థనలను పాటించడం వల్ల... అభివృద్ధి చెందిన కర్ణాటక, అభివృద్ధి చెందిన భారత్ దిశగా మన సమష్టి పయనం మరింత వేగవంతమవుతుందని దృఢ విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. “వికసిత భారత్ లక్ష్యం దిశగా దృఢ సంకల్పంతో మనం వేగంగా పురోగమిద్దాం” అని శ్రీ మోదీ పిలుపునిచ్చారు.

# టెలికాం ఆధారిత ఆర్థిక మోసాలపై పోరాటాన్ని బలోపేతం చేసే దిశగా డీవోటీ, సెబీ మధ్య కుదిరిన ఎంవోయూ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:భారత ఆర్థిక వ్యవస్థ భద్రతను పటిష్టం చేసే దిశగా చేపట్టిన కీలక చర్యలో భాగంగా.. టెలికమ్యూనికేషన్ల విభాగం, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) మధ్య వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. సెక్యూరిటీల మార్కెట్ మోసాలు, పెట్టుబడి సంబంధిత కుంభకోణాల్లో టెలికాం వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడంలో సహకారాన్ని విస్తరింపజేయడమే ఈ ఒప్పందం ఉద్దేశం.

ఈ ఒప్పందంపై డీవోటీలోని ఏఐ అండ్ డిజిటల్ ఇంటిలిజెన్స్ యూనిట్ (ఏఐ అండ్ డీఐయూ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీ సంజీవ్ కుమార్ శర్మ, సెబీలో పూర్తికాల సభ్యులు శ్రీ సందీప్ ప్రధాన్ సంతకాలు చేశారు. డిజిటల్ కమ్యూనికేషన్ల కమిషన్ సభ్యులు (సేవలు) శ్రీ దేబ్ కుమార్ చక్రబర్తి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. టెలికాం నిఘా వ్యవస్థలు, ఆర్థిక మార్కెట్ నియంత్రణా సంస్థల మధ్య బలమైన సహకారం దిశగా వేసిన ముందడుగుని ఇది సూచిస్తుంది.

మోసపూరిత కార్యకలాపాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవడమే లక్ష్యంగా నిర్మాణాత్మక సమాచార భాగస్వామ్య వ్యవస్థ ఈ ఒప్పందంలో ప్రధాన భాగంగా ఉంది. బహుముఖ విశ్లేషణ ద్వారా అనుమానాస్పద చర్యలతో ముడిపడి ఉన్న మొబైల్ నంబర్లను గుర్తించేలా ఆర్థిక మోసాల ముప్పు సూచీ (ఎఫ్ఆర్ఐ)ను సెబీతో డీవోటీ పంచుకుంటుంది. మొబైల్ నంబర్ రివోకేషన్ లిస్ట్ (ఎంఎన్ఆర్ఎల్)ను కూడా పంచుకుంటుంది. దీని వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న, చెల్లుబాటయ్యే మొబైల్ కనెక్షన్లతో మాత్రమే పెట్టుబడిదారుల ఖాతాలను అనుసంధానించే వీలు మధ్యవర్తులు, ఆస్తి నిర్వహణ సంస్థలతో సహా సెబీ నియంత్రిత సంస్థలకు కలుగుతుంది. ఈ ఒప్పందంలో భాగంగా.. సైబర్ మోసాలు, నకిలీ లేదా మనీ మ్యూల్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఖాతాలకు అనుసంధానమైన టెలికాం నంబర్లకు సంబంధించిన సమాచారాన్ని సెబీ అందిస్తుంది. తద్వారా టెలికాం విభాగంలో సత్వరమే చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది.

డీవోటీకి చెందిన డిజిటల్ ఇంటిలిజెన్స్ వేదిక (డీఐపీ) ద్వారా ఈ సమాచార ప్రసారం జరుగుతుంది. ఈ వేదిక ఇప్పటి వరకు 1400కు పైగా భాగస్వాములను అనుసంధానించింది. తగిన చర్యలు చేపట్టే విధంగా సమాచారాన్ని వివిధ సంస్థలకు ఎప్పటికప్పుడు చేరవేస్తుంది.

భారత్‌లో డిజిటల్ పెట్టుబడుల రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ సహకారం ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. టెలికాం నిఘా వ్యవస్థలను మార్కెట్ పర్యవేక్షణ వ్యవస్థలతో ఏకీకృతం చేయడం ద్వారా... ఫిర్యాదులపై స్పందించే స్థాయి నుంచి ముందస్తు నివారణ చేపట్టే స్థాయికి మార్పులను తీసుకువస్తుంది. సంచార్ సాథీలో టెలికాం విభాగం నిర్వహిస్తున్న చక్షు ద్వారా స్వీకరించిన సమాచారం ఆధారంగా ఆర్థిక మోసాల ముప్పు సూచీ – ఆర్థిక సంస్థలకు, లా ఎన్ఫోర్స్‌మెంట్ సంస్థలు ముందస్తు హెచ్చరికల వ్యవస్థగా పనిచేస్తుంది. ఇది ఆర్థిక మోసాలు జరగకముందే మోసపూరితమైనవని భావిస్తున్న మొబైల్ నంబర్లను ముందుగానే గుర్తిస్తుంది.

ప్రస్తుతం కొనసాగుతున్న డీవోటీ కార్యక్రమాలు ఏర్పాటు చేసిన బలమైన పునాదిపై ఈ భాగస్వామ్యం నిర్మితమైంది. సంచార్ సాథీ పరిధిలో 88 లక్షలకు పైగా మోసపూరిత మొబైల్ నంబర్లను ఏఎస్‌టీఆర్ ఉపయోగించి నిలిపివేశారు. గడచిన పది నెలల్లో సుమారుగా రూ.2300 కోట్ల మేర ఆర్థిక నష్టాలు జరగకుండా నివారించడంలో ఎఫ్ఆర్ఐ తోడ్పడింది.

భవిష్యత్తులో సమన్వయ చర్యలకు, సంస్థాగత స్థాయిలో ప్రమాద సూచికలను పంచుకోవడానికి వీలు కల్పించే ప్రామాణిక కార్యాచరణ పద్ధతులను అభివృద్ధి చేయడంలో ఈ అవగాహన ఒప్పందం వీలు కల్పిస్తుంది. కొనసాగుతున్న సంప్రదింపులు, మారుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కోవడంలో ఆచరణీయ యంత్రాంగాల సహాయంతో పెట్టుబడిదారుల భద్రతను గణనీయంగా బలోపేతం చేయడానికి, భారత డిజిటల్, ఆర్థిక వ్యవస్థలపై నమ్మకాన్ని పెంపొందించేందుకు డీవోటీ–సెబీ మధ్య కుదిరిన ఒప్పందం సహకరిస్తుంది.

# పదిహేడేళ్ల నాటి వన్యప్రాణి నేరం కేసులో దోషిగా తేలిన శహ్‌తుశ్ వ్యాపారి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:భారత వన్యప్రాణి సంబంధిత నేరాల నియంత్రణ ఆదేశాల్లో చరిత్రాత్మక ఆదేశం ఇది.. చట్టవిరుద్ధంగా శహ్‌తూశ్ శాలువాలను ఎగుమతి చేయడానికి ప్రయత్నించి, ‘వన్యప్రాణి పరిరక్షణ చట్టం–1972’ను అతిక్రమించారంటూ జైపూర్‌లోని ఒక చిత్రశాల యజమానిని దోషిగా న్యూఢిల్లీలోని ఓ న్యాయస్థానం నిర్ధారించింది. శహ్‌తుశ్ శాలువా తయారీకి.. టిబెట్‌లో సంచరించే కొమ్ముల జింక (పాంథలోప్స్ హాగ్‌సోనీ) వెంట్రుకలను ఉపయోగించారని తేలింది.

జైపూర్‌లోని ఇండియన్ ఆర్ట్ గ్యాలరీ యజమాని సయ్యద్ షాహిద్ అహ్మద్ కాశానీకి వ్యతిరేకంగా రావుజ్ ఎవెన్యూ జిల్లా న్యాయస్థానాల చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు 2026 మార్చి నెల 12న తీర్పును ప్రకటించారు. దీంతో, 2008లో నమోదైన కేసును ఎట్టకేలకు కొలిక్కి తీసుకువచ్చినట్లయింది.

టిబెట్‌లో కనిపించే కొమ్ముల జింక స్థానికంగా చిరూ పేరిట ప్రసిద్ధం. దీనిని వన్యప్రాణి (పరిరక్షణ) చట్టం–1972 లోని షెడ్యూలు ఎ లో చేర్చారు. స్థానిక చట్టాల్ని అనుసరించి, దీంతో వ్యాపారం చేయడంపై కఠిన నిషేధాజ్ఞలను అమల్లోకి తెచ్చారు. సీఐటీఈఎస్‌లో పేర్కొన్న ప్రకారం, 1975 నుంచి శహ్‌తుశ్ శాలువాల వ్యాపారాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిషేధించారు. సీఐటీఈఎస్‌పై సంతకం చేసిన దేశాల్లో భారత్ కూడా ఉంది.

వన్యప్రాణి నేర నియంత్రణ మండలి (డబ్ల్యూసీసీబీ), కేంద్ర పరిశోధక మండలి (సీబీఐ), భారత కస్టమ్స్, వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ (డబ్ల్యూఐఐ)లు కలిసికట్టుగా చక్కని సమన్వయంతో సుమారు 17 సంవత్సరాల పాటు ముందుకు సాగడం ఈ కేసు ప్రత్యేకత. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 1,290 శహ్‌తుశ్ శాలువాలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నట్లు డబ్ల్యూసీసీబీ గుర్తించింది. 2009 ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో సీబీఐకి చెందిన ఈఓయూ–వీ బ్రాంచిలో ఫిర్యాదును దాఖలు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణ జరిగిన వన్యప్రాణి సంబంధిత తొలి నేరం ఇది.

పశ్మీనా శాలువలను ఎగుమతి చేయాలంటే వన్యప్రాణి అధికారుల వద్ద నుంచి నిరభ్యంతర ధ్రువపత్రాన్ని పొందాలి. ఈ కారణంగా ఉత్తర ప్రాంత డబ్ల్యూసీసీబీ ఇన్‌స్పెక్టర్ ఆరతీ సింగ్ ఎగుమతి సరకును పరిశీలించి, ఆ శాలువాలను శహ్‌తుశ్ ఉన్నితో తయారు చేశారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. 41 శాలువాల రూపకల్పనలో టిబెట్ జాతి జింకల వెంట్రుకల్ని ఉపయోగించారని డెహ్రాడూన్‌లోని భారతీయ వన్యప్రాణి సంస్థ (డబ్ల్యూఐఐ) ఫోరెన్సిక్ పరీక్షలో తేలింది. మొదటి దశలో 5 శాలువాల్లోనూ, రెండో దశ దర్యాప్తులో 36 శాలువాల్లోనూ ఆధారాలు లభించాయి.

# అగ్ని ప్రమాదాలపై గృహవాసులకు అవగాహన




హైదరాబాద్, ఏప్రిల్ 16:పట్టణంలోని సగర వీధి ప్రాంతంలో గృహవాసులకు అగ్ని ప్రమాదాలపై పరకాల ఫైర్ స్టేషన్ ఆఫీసర్ వి భద్రయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ భద్రయ్య మాట్లాడుతూ ప్రజల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నమని పాఠశాలలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, గ్రామీణ ప్రాంతాలలో అవగాహన సదస్సులు మాక్ డ్రిల్స్ అలాగే విద్యుత్ భద్రత, ఎల్పీజీ వినియోగం, గ్యాస్ లీకేజీ నివారణ, అగ్ని ప్రమాద సమయంలో పాటించవలసిన చర్యలపై ప్రజలకు వివరంగా సూచనలు అందించారు.

ఏప్రిల్ 14 నుండి 20 వరకు ఫైర్ సర్వీస్ వీక్ వారోత్సవాలలో భాగంగా 16-04-2026 గురువారం రోజున పరకాల పట్టణంలోని సగర వీధి కాలనీలో గృహవాసులకు కరపత్రాల పంపిణీ, గోడలకు పోస్టర్లు అంటించి ఇండ్లలో జరిగే గ్యాస్ ప్రమాదాల గురించి మరియు షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ఎలా స్పందించాలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఎఫ్ ఎఫ్ పి కృష్ణ కుమార్, ఎఫ్ ఎఫ్ టి జి గణేష్ , ఎఫ్ ఎఫ్ సిహెచ్ దిలీప్, ఎఫ్ ఎఫ్ డి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ‘గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలి’

### –నల్లగొండ 24వ డివిజన్ కార్పోరేటర్ గోపగాని స్వాతి రాజశేఖర్

నల్గొండ, ఏప్రిల్ 16: చిన్నారులు, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనతను తగ్గించేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకునేలా ప్రోత్సాహించాలని నల్లగొండ 24వ డివిజన్ కార్పొరేటర్, బీఆర్ఎస్ నేత గోపగాని స్వాతి రాజశేఖర్ అన్నారు. గురువారం మాన్యంచెల్క సెక్టార్ పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని 24వ డివిజన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పోషణ్ పక్వాడపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును అమె ప్రారంభించి మాట్లాడారు. పోషక ఆహార భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని, అందులో భాగంగా గర్భినీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. చాలా మంది మహిళలు రక్త హీనతతో బాధపడుతున్నారని దీనివల్ల చిన్నారులు బలహీనంగా అనారోగ్యంతో జన్మించి చనిపోతున్నారని తెలిపారు. దీన్ని అదిగమించేందుకు ప్రభుత్వం పోషణ్ అభియాన్ పేరుతో వెయ్యి రోజుల కార్యక్రమాన్ని తీసుకవచ్చిందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు చిన్నారులకు, గర్భినీలకు పౌష్టికాహారా. అందిస్తుందున సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. మహిళల్లో రక్తహీనత కారణంగా చిన్నారులు పౌష్టికాహారం లోపాన్ని అధిగమించేందుకు గర్భిణులు, బాలింతలు ఏ సమయంలో ఎలాంటి అహారం తీసుకోవాలి, ఏ రకమైన భోజనం తీసుకోవాలనే అంశాలపై వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు.

# వినియోగదారుల అనుభవాన్ని, డిజిటల్ అందుబాటును మెరుగుపరిచేందుకు ‘మై ఎల్ఐసీ’, ‘సూపర్ సేల్స్ సాథీ’ మొబైల్ యాప్‌లను ప్రారంభించిన ఎల్ఐసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:నేడు ముంబయిలో ఎల్ఐసీకి చెందిన రెండు కొత్త మొబైల్ యాప్‌లను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి శ్రీ ఎం. నాగరాజు ప్రారంభించారు. వినియోగదారుల కోసం ‘మై ఎల్ఐసీ’ యాప్‌ను, ఏజెంట్ల కోసం ‘ఎల్ఐసీ సూపర్ సేల్స్ సాథీ’యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ సీఈఓ, ఎండీ శ్రీ ఆర్ దొరైస్వామి, మేనేజింగ్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 26 కోట్లకు పైగా పాలసీలతో దేశంలో అత్యంత విస్తృతమైన వ్యవస్థను కలిగి ఉన్న ఎల్ఐసీ.. వేగంగా మారుతున్న బీమా మార్కెట్ లో పోటీ సామర్థ్యాన్ని నిలుపుకోవడానికి, సేవల సామర్థ్యాన్ని పెంచడానికి, వినియోగదారులకు వేగవంతమైన, నాణ్యమైన డిజిటల్ సేవలను అందించడంలో ఈ యాప్‌లు కీలకపాత్ర పోషించనున్నాయి.

మై ఎల్ఐసీ యాప్ పాలసీ సేవలు, క్లెయిమ్ సాయం, ప్రీమియం చెల్లింపులు, డాక్యుమెంటేషన్, వినియోగదారుల భాగస్వామ్యం వంటి అన్ని సౌకర్యాలను ఒకే చోట అందిస్తుంది. వినియోగదారులకు పూర్తి డిజిటల్ అనుభవాన్ని అందిస్తుంది. ఇది కాగితపు పనిని తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడానికి సహాయపడుతుంది. పాలసీదారులు తమ ఆర్థిక రక్షణ బాధ్యతలను స్వయంగా నిర్వహించుకునేలా చేస్తుంది. ఈ కొత్త డిజిటల్ వేదిక కేవలం వినియోగదారులకే పరిమితం కాదు. సూపర్ సేల్స్ సాథీ యాప్, ఎల్ఐసీ మధ్యవర్తులు, క్షేత్రస్థాయి సిబ్బంది మరింత సమర్థవంతంగా, నమ్మకంగా సేవలు అందించేలా సహాయపడుతుంది. మార్కెటింగ్ సమాచారం, పనితీరును పర్యవేక్షించడం, వినియోగదారుల వివరాలను విశ్లేషించే డిజిటల్ సాధనాల ద్వారా పాలసీదారులకు మొదటి నుంచి చివరి వరకు మరింత నమ్మకంతో, సమర్థవంతంగా సేవలు అందించడానికి ఇది తోడ్పడుతుంది.

# న్యూఢిల్లీలో బ్రిక్స్ హెల్త్ వర్కింగ్ గ్రూప్-2026 తొలి సమావేశాన్ని నిర్వహించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ




న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:బ్రిక్స్ వ్యవస్థ ద్వారా హెల్త్ వర్కింగ్ గ్రూప్ (హెచ్‌డబ్ల్యూజీ)-2026 తొలి సమావేశాన్ని భారత ప్రభుత్వ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో నిర్వహించింది. ప్రజారోగ్య రంగంలో పరస్పర సహకారం, ప్రాధాన్యతా అంశాలపై చర్చించటానికి బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేషియా వంటి బ్రిక్స్ సభ్యదేశాల నుంచి సీనియర్ ఆరోగ్య అధికారులు, సాంకేతిక నిపుణులు, ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్-2026 "స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" ఇతివృత్తంతో సాగుతుంది. రియో-2025 సదస్సులో గౌరవ ప్రధానమంత్రి స్పష్టం చేసినట్లుగా.. ఇది ప్రజా సంక్షేమం, మానవత్వ దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతిస్పందించే, సమ్మిళిత, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సహకార వ్యవస్థలను బలోపేతం చేయాలన్న భారత నిబద్ధతను ఈ ఇతివృత్తం స్పష్టం చేస్తుంది.

సమావేశం ప్రారంభంలో కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి పుణ్య సలీల శ్రీవాస్తవ.. బ్రిక్స్ సభ్య దేశాలకు స్వాగతం పలికారు. ప్రజారోగ్య రంగంలో సహకారాన్ని పెంపొందించటానికి హెల్త్ వర్కింగ్ గ్రూప్ కీలక వేదికని ఆమె అన్నారు.

ఇటీవల సంవత్సరాల్లో జరిగిన బ్రిక్స్ హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలు అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయటం, తక్కువ ధరకే మందుల లభ్యత వంటి కీలక ఆరోగ్య సవాళ్లపై సహకారానికి మార్గం సుగమం చేశాయని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలు మహమ్మారిని ఎదుర్కొనే సంసిద్ధత, ఆరోగ్య రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు, అందరికీ ఆరోగ్య భద్రతను అందించటంలో సహకారాన్ని మరింత బలోపేతం చేశాయి.

భారత అధ్యక్షతన జరిగే బ్రిక్స్-2026లో ప్రాధాన్యతలను తెలియజేస్తూ.. బ్రిక్స్ దేశాల విభిన్న ఆరోగ్య వ్యవస్థలను, సామా జిక-ఆర్థిక పరిస్థితులను గుర్తిస్తూనే.. సమగ్రమైన, స్థిరమైన, సాక్ష్యాధారిత ఆరోగ్య సహకారాన్ని పెంపొందించటమే ఆరోగ్య వర్కింగ్ గ్రూప్ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. విస్తరించదగిన, ప్రభావవంతమైన ఆరోగ్య కార్యక్రమాలను రూపొందించటానికి అనుకూలత, పరస్పరం నేర్చుకోవటం, ఉమ్మడి నైపుణ్యాన్ని ఉపయోగించుకునే ప్రాముఖ్యతను ఆమె తెలియజేశారు.

ఉత్తమ విధానాలను పంచుకోవటం, ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయటం, ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులకు సమర్థవంతంగా స్పందించగల స్థితిస్థాపక ఆరోగ్య వ్యవస్థల ఏర్పాటు వంటి అంశాలకు వరుసగా జరిగిన బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల సమావేశాలు, డిక్లరేషన్లు నిరంతరం ప్రాధాన్యత నిస్తున్నాయని కార్యదర్శి స్పష్టం చేశారు. ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి, టీకాలు, ఔషధాల సమాన లభ్యత, సామర్థ్య పెంపుదల కార్యక్రమాల్లో సహకారాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ప్రస్తుత ప్రాధాన్యతలకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేస్తూనే భారత అధ్యక్షతన కేంద్ర ఆరోగ్య కార్యదర్శి రెండు నూతన ప్రాధాన్యతా అంశాలను ప్రతిపాదించారు.

ఆరోగ్యకరమైన జీవనశైలికి బ్రిక్స్ మిషన్... ఇది ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించటం, అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవటం, పొగాకు వాడకం, మద్యపానం వంటి ప్రధాన ప్రమాద కారకాలను అరికట్టటం లక్ష్యంగా పెట్టుకుంది.

మానసిక ఆరోగ్యం, వికాసాన్ని పెంపొందించటం... మానసిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయటం, సామాజిక వివక్షను తొలగించటం, మానసిక ఆరోగ్యాన్ని విస్తృత ప్రజారోగ్య వ్యవస్థలో చేర్చటంపై ఇది దృష్టి సారిస్తుంది.

సార్వత్రిక ఆరోగ్య రక్షణ, సుస్థిరాభివృద్ధి సాధనలో.. జీవవైవిధ్యం, దేశీయ విజ్ఞాన వ్యవస్థల ఆధారంగా రూపొందిన సాక్ష్యాధారిత సంప్రదాయ వైద్యం అత్యంత విలువైనదని ఆమె స్పష్టం చేశారు. ఈ రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

వివిధ దేశాల మధ్య సహకారం, భాగస్వామ్యాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ... హెల్త్ ట్రాక్ పరిధిలో జరిగే చర్చలు బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేస్తాయని, పరస్పర అవగాహనను పెంచుతాయని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఆరోగ్య రంగంలో ఉమ్మడి లక్ష్యాలను స్పష్టమైన ఫలితాలుగా మార్చటానికి ప్రతినిధులందరూ క్రియాశీల కంగా పాల్గొని, సహకారాన్ని అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్య సవాళ్లను పరిష్కరించటంలో సమగ్రమైన, సమష్టి విధానాన్ని ప్రతిబింబిస్తూ.. బ్రిక్స్ హెల్త్ వర్కింగ్ గ్రూప్ గుర్తించిన తొమ్మిది ప్రాధాన్యత అంశాలపై ఈ సమావేశం చర్చించింది. వీటిలోని అంశాలు: (ఎ) బ్రిక్స్ టీబీ పరిశోధన వ్యవస్థ (తితి) బ్రిక్స్ వైద్య ఉత్పత్తుల నియంత్రణ సంస్థల మధ్య సహకారం (తితితి) సామూహిక అంటువ్యాధుల నివారణ, ప్రతిస్పందనకు బ్రిక్స్ సమగ్ర ముందస్తు హెచ్చరిక వ్యవస్థ (తిల) నిరంతర సంరక్షణకు డిజిటల్ హెల్త్ ఆర్కిటెక్చర్ (ల) ఆరోగ్యకరమైన జీవనశైలికి బ్రిక్స్ మిషన్ (లతి) మానసిక ఆరోగ్యం, సంక్షేమాన్ని పెంపొందించటం (లతితి) సంప్రదాయ, అనుబంధ, సమగ్ర వైద్యం (టీసీఐఎం) (లతితితి) సామాజిక పరిస్థితుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై పోరాటం (డీడీఎస్‌డీహెచ్) (తిలీ) జాతీయ ప్రజారోగ్య సంస్థల బ్రిక్స్ వ్యవస్థ.

పరిశోధన, ఆవిష్కరణలు, నియంత్రణల సమన్వయం, డిజిటల్ ఆరోగ్యం, అందరికీ సమానంగా ఆరోగ్య సేవలను అందించటంలో సహకారాన్ని బలోపేతం చేయటమే కాక, బ్రిక్స్ దేశాల మధ్య సమష్టి సంసిద్ధతను, స్థిరత్వాన్ని పెంపొందించటమే ఈ ప్రాధాన్యతా అంశాల లక్ష్యం.

భారతదేశ నాయకత్వాన్ని, ఆవిష్కరణలు, సహకారం, స్థిరత్వం ద్వారా స్థితిస్థాపకతను పెంపొందించాలనే ఉమ్మడి ఇతివృత్తాన్ని సభ్య దేశాలు స్వాగతించాయి. ఆరోగ్యకరమైన జీవనశైలి మానసిక సంక్షేమాన్ని పెంపొందించటం వంటి నూతన ప్రాధాన్యతలతో పాటు సంప్రదాయ, అనుబంధ, సమగ్ర వైద్య పద్ధతులను ఆరోగ్య వ్యవస్థల్లో విలీనం చేయాలనే ప్రతిపాదనకు బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా దేశాలు మద్దతిచ్చాయి. బ్రిక్స్ టీబీ రీసెర్చ్ వ్యవస్థ ద్వారా క్షయవ్యాధి నివారణలో సహకారాన్ని మరింత పెంచటం, అంటువ్యాధుల కోసం ఉద్దేశించిన బ్రిక్స్ ఇంటిగ్రేటెడ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్‌ను బలోపేతం చేయటం, డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలను మెరుగుపరచటం ద్వారా (ముఖ్యంగా మారుమూల, వెనుకబడిన వర్గాలకు) వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావటం వంటి అంశాలపై వారు ఆసక్తి కనబరిచారు. ఔషధాల నియంత్రణలో పరస్పర సహకారం, మందులు, వ్యాక్సిన్ల స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వారు స్పష్టం చేశారు. వివిధ ప్రకటనల ద్వారా సార్వత్రిక ఆరోగ్య కవరేజీ, సామాజిక పరిస్థితుల వల్ల తలెత్తే వ్యాధులను, ఆరోగ్యానికి సంబంధించిన సామాజిక అంశాలను పరిష్కరించటం, ఆరోగ్య సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావటం వంటి ఉమ్మడి లక్ష్యాలని సభ్య దేశాలు స్పష్టం చేశాయి. ప్రాధాన్యత గల లక్ష్యాలపై ఏకాభిప్రాయంతో బ్రిక్స్ హెల్త్ ట్రాక్-2026 పరిధిలో జరగబోయే సాంకేతిక సమావేశాలు, మంత్రిత్వ స్థాయి చర్చల ద్వారా భవిష్యత్ కార్యాచరణపై అంగీకారంతో ఈ సమావేశం ముగిసింది. భాగస్వామ్యం, ఆవిష్కరణలు, ఉమ్మడి బాధ్యత ద్వారా ప్రపంచ ఆరోగ్య భద్రతకు అర్థవంతమైన సహకారాన్ని అందించేందుకు బ్రిక్స్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

## 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కార్యాచరణ మార్గదర్శకాలను విడుదల చేసిన కేంద్ర మంత్రి శ్రీ మనోహర్ లాల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:న్యూఢిల్లీలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కార్యాచరణ మార్గదర్శకాలతో పాటు క్రెడిట్ రీపేమెంట్ గ్యారెంటీ సబ్-స్కీమ్ (సీఆర్‌జీఎస్ఎస్)ను కేంద్రమంత్రి శ్రీ మనోహర్ లాల్ ఇవాళ ప్రారంభించారు. దేశంలోని పట్టణ మౌలిక సదుపా యాల ఆర్థిక వ్యవస్థలో విప్లవా త్మక మార్పులకు ఇది కీలక ముందడుగు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా సహా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ మోహన్ యాదవ్, ఒడిశా ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.

శ్రీ మనోహర్ లాల్ ప్రసంగిస్తూ.. భారత పట్టణాభివృద్ధి విధానంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ విప్లవాత్మక మార్పని అన్నారు. ఈ నిధి కేవలం గ్రాంట్లు ఇవ్వటానికి మాత్రమే కాదని, ప్రభుత్వ నిధుల ఆధారంగా భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించటం, నగరాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ పెట్టుబడులకు అనువైనవిగా తీర్చిదిద్దటమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

భారతదేశ నగరాలు ఆర్థిక వృద్ధికి, ఆవిష్కరణలకు, ఉపాధి కల్పనకు ప్రధాన శక్తిగా ఎదుగుతున్నాయని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. మన నగరాలకు సమర్థవంతమైన ప్రణాళిక, నిధులను సమకూర్చటం, వాటి పాలన విధానంపైనే వికసిత్ భారత్-2047 దార్శనికత సాకారం ఆధారపడి ఉంటుందన్నారు. అమృత్, స్వచ్ఛ భారత్ మిషన్, స్మార్ట్ సిటీస్ మిషన్ వంటి కార్యక్రమాలు పట్టణ మౌలిక సదుపాయాలను ఇప్పటికే బలోపేతం చేశాయని, తదుపరి దశలో నగరాలు పెట్టుబడులను ఆకర్షించేలా సిద్ధం కావాలని, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించాలని అన్నారు.

ఒక లక్ష కోట్ల రూపాయల కేంద్ర సహాయంతో రూపొందించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్, మార్కెట్ ఆధారిత ఫైనాన్సింగ్ ద్వారా దాదాపు నాలుగు రెట్ల పెట్టుబడిని సమీకరించే ఉత్ప్రేరక సాధనంగా పనిచేస్తుందని మంత్రి వెల్లడించారు. కేంద్ర సహాయం ప్రాజెక్ట్ వ్యయంలో 25 శాతానికి పరిమితం అవుతుందని, కనీసం 50 శాతం నిధులను మున్సిపల్ బాండ్లు, బ్యాంక్ రుణాలు, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా సేకరిస్తామని, తద్వారా ఆర్థిక క్రమశిక్షణను పెంచటంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

మొత్తం కేటాయింపుల్లో రూ. 90,000 కోట్లను వివిధ ప్రాజెక్టులకు, రూ. 5,000 కోట్లను ప్రాజెక్ట్ తయారీ, సామర్థ్య పెంపుదలకు, మరో రూ. 5,000 కోట్లను క్రెడిట్ రీపేమెంట్ గ్యారెంటీ సబ్-స్కీమ్ కోసం కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ సీఆర్‌జీఎస్ఎస్ పథకం ముఖ్యంగా టైర్-ఎఎ, టైర్-ఎఎఎ నగరాలతో పాటు కొండ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లోని చిన్న నగరాలకు ఎంతో మేలు చేస్తుంది. క్రెడిట్ గ్యారెంటీల ద్వారా ఆయా నగరాలు మార్కెట్ ఆధారిత ఆర్థిక వనరులను పొందేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు.

పాత నగరాలు, మార్కెట్ల అభివృద్ధి, పట్టణ రవాణా, ప్రతీ ప్రాంతానికి అనుసంధానత, సైక్లింగ్, పాదచారుల మార్గాల ఏర్పాటు, మంచినీరు, పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలు, వాతావరణ మార్పులను తట్టుకోగల పట్టణాభివృద్ధి వంటి కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పుల ప్రాజెక్టులకు ఈ నిధులు మద్దతిస్తాయని శ్రీ మనోహర్ లాల్ స్పష్టం చేశారు. దీర్ఘకాలికంగా ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను అందించే సామర్థ్యం ఉండి, విస్తరించదగిన, ప్రభావవంతమైన, బ్యాంకు రుణ సదుపాయం పొందేందుకు అర్హత గల ప్రాజెక్టులపైనే ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

## టెలికాం ఆధారిత ఆర్థిక మోసాలపై పోరాటాన్ని బలోపేతం చేసే దిశగా డీవోటీ, సెబీ మధ్య కుదిరిన ఎంవోయూ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:భారత ఆర్థిక వ్యవస్థ భద్రతను పటిష్టం చేసే దిశగా చేపట్టిన కీలక చర్యలో భాగంగా.. టెలికమ్యూనికేషన్ల విభాగం, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) మధ్య వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. సెక్యూరిటీల మార్కెట్ మోసాలు, పెట్టుబడి సంబంధిత కుంభకోణాల్లో టెలికాం వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడంలో సహకారాన్ని విస్తరింపజేయడమే ఈ ఒప్పందం ఉద్దేశం.

ఈ ఒప్పందంపై డీవోటీలోని ఏఐ అండ్ డిజిటల్ ఇంటిలిజెన్స్ యూనిట్ (ఏఐ అండ్ డీఐయూ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీ సంజీవ్ కుమార్ శర్మ, సెబీలో పూర్తికాల సభ్యులు శ్రీ సందీప్ ప్రధాన్ సంతకాలు చేశారు. డిజిటల్ కమ్యూనికేషన్ల కమిషన్ సభ్యులు (సేవలు) శ్రీ దేబ్ కుమార్ చక్రబర్తి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. టెలికాం నిఘా వ్యవస్థలు, ఆర్థిక మార్కెట్ నియంత్రణా సంస్థల మధ్య బలమైన సహకారం దిశగా వేసిన ముందడుగుని ఇది సూచిస్తుంది.

డీవోటీ-సెబీ భాగస్వామ్యంలో ముఖ్యాంశాలు

మోసపూరిత కార్యకలాపాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవడమే లక్ష్యంగా నిర్మాణాత్మక సమాచార భాగస్వామ్య వ్యవస్థ ఈ ఒప్పందంలో ప్రధాన భాగంగా ఉంది. బహుముఖ విశ్లేషణ ద్వారా అనుమానాస్పద చర్యలతో ముడిపడి ఉన్న మొబైల్ నంబర్లను గుర్తించేలా ఆర్థిక మోసాల ముప్పు సూచీ (ఎఫ్ఆర్ఐ)ను సెబీతో డీవోటీ పంచుకుంటుంది. మొబైల్ నంబర్ రివోకేషన్ లిస్టు (ఎంఎన్ఆర్ఎల్)ను కూడా పంచుకుంటుంది. దీని వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న, చెల్లుబాటయ్యే మొబైల్ కనెక్షన్లతో మాత్రమే పెట్టుబడిదారుల ఖాతాలను అనుసంధానించే వీలు మధ్యవర్తులు, ఆస్తి నిర్వహణ సంస్థలతో సహా సెబీ నియంత్రిత సంస్థలకు కలుగుతుంది. ఈ ఒప్పందంలో భాగంగా.. సైబర్ మోసాలు, నకిలీ లేదా మనీ మ్యూల్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఖాతాలకు అనుసంధానమైన టెలికాం నంబర్లకు సంబంధించిన సమాచారాన్ని సెబీ అందిస్తుంది. తద్వారా టెలికాం విభాగంలో సత్వరమే చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది.

డీవోటీకి చెందిన డిజిటల్ ఇంటిలిజెన్స్ వేదిక (డీఐపీ) ద్వారా ఈ సమాచార ప్రసారం జరుగుతుంది. ఈ వేదిక ఇప్పటి వరకు 1400కు పైగా భాగస్వాములను అనుసంధానించింది. తగిన చర్యలు చేపట్టే విధంగా సమాచారాన్ని వివిధ సంస్థలకు ఎప్పటికకప్పుడు చేరవేస్తుంది.

పెట్టుబడిదారుల భద్రత దిశగా చురుకైన, సమీకృత విధానం

భారత్‌లో డిజిటల్ పెట్టుబడుల రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ సహకారం ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. టెలికాం నిఘా వ్యవస్థలను మార్కెట్ పర్యవేక్షణ వ్యవస్థలతో ఏకీకృతం చేయడం ద్వారా... ఫిర్యాదులపై స్పందించే స్థాయి నుంచి ముందస్తు నివారణ చేపట్టే స్థాయికి మార్పులను తీసుకు వస్తుంది. సంచార్ సాథీలో టెలికాం విభాగం నిర్వహిస్తున్న చక్షు ద్వారా స్వీకరించిన సమాచారం ఆధారంగా ఆర్థిక మోసాల ముప్పు సూచీ - ఆర్థిక సంస్థలకు, లా ఎన్ఫోర్స్‌మెంట్ సంస్థలు ముందస్తు హెచ్చరికల వ్యవస్థగా పనిచేస్తుంది. ఇది ఆర్థిక మోసాలు జరగకముందే మోసపూరితమైనవని భావిస్తున్న మొబైల్ నంబర్లను ముందుగానే గుర్తిస్తుంది.

ప్రస్తుతం కొనసాగుతున్న డీవోటీ కార్యక్రమాలు ఏర్పాటు చేసిన బలమైన పునాదిపై ఈ భాగస్వామ్యం నిర్మితమైంది. సంచార్ సాథీ పరిధిలో 88 లక్షలకు పైగా మోసపూరిత మొబైల్ నంబర్లను ఏఎస్‌టీఆర్ ఉపయోగించి నిలిపివేశారు. గడచిన పది నెలల్లో సుమారుగా రూ.2300 కోట్ల మేర ఆర్థిక నష్టాలు జరగకుండా నివారించడంలో ఎఫ్ఆర్ఐ తోడ్పడింది.

భవిష్యత్తులో సమన్వయ చర్యలకు, సంస్థాగత స్థాయిలో ప్రమాద సూచికలను పంచుకోవడానికి వీలు కల్పించే ప్రామాణిక కార్యాచరణ పద్ధతులను అభివృద్ధి చేయడంలో ఈ అవగాహన ఒప్పందం వీలు కల్పిస్తుంది. కొనసాగుతున్న సంప్రదింపులు, మారుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కోవడంలో ఆచరణీయ యంత్రాంగాల సహాయంతో పెట్టుబడిదారుల భద్రతను గణనీయంగా బలోపేతం చేయడానికి, భారత డిజిటల్, ఆర్థిక వ్యవస్థలపై నమ్మకాన్ని పెంపొందించేందుకు డీవోటీ-సెబీ మధ్య కుదిరిన ఒప్పందం సహకరిస్తుంది.

# మానవ తప్పిదాలే రోడ్డు ప్రమాదాలకు కారణాలు

## - పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 16: మానవ తప్పిదాలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని, ప్రతి ఒక్కరూ రహదారి నియమ, నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గురువారం బూర్గంపహాడ్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జమలారెడ్డి అధ్యక్షతన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భద్రాచలం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య, తాసీల్దార్ కేఆర్కే ప్రసాద్‌తో కలిసి డీఎస్పీ మాట్లాడారు. వాహన దారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్‌బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం వద్దు? పరిమితికి మించి వాహనాలు నడపొద్దని సూచించారు.




వాహనదారుడు ప్రమాదానికి గురైతే తానే కాకుండా కుటుంబాన్ని బాధ పెట్టిన వారవుతారన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే మానవ రక్షణ ఉంటుందన్నారు. అదే విధంగా మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు తమతమ శాఖలో జరుగుతున్న పనులు, చేపట్టే పనులను వివరించారు. అనంతరం వివిధ సంఘాల మహిళలు, ప్రజా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో సర్పంచ్ మందా నాగరాజు, ఎంఈఓ యదు సింహారాజు, ఎస్ఐలు వేడా ప్రసాద్, నాగభిక్షం, మోరంపల్లిబంజర్ పీహెచ్‌సీ వైద్యులు నగేష్, ట్రాన్స్‌కో ఏఈ ఉపేందర్, ఇరిగేషన్ ఏఈ గణేష్ నాయక్, పీఆర్ ఏఈ చక్రధరా చారి, భజన సతీశ్‌కుమార్, ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, ఐకేపీ, ఆశా, ఏఎన్ఎంలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి గ్రామ పంచాయతీని 'మోడల్ గ్రామం'గా తీర్చిదిద్దాలి : కలెక్టర్ అంకిత్



ఖమ్మం, ఏప్రిల్ 16: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూలూరుపాడు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శవంతమైన మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. జూలూరుపాడు రైతు వేదికలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రగతి ప్రణాళికను అమలు చేస్తోందని, ఇప్పటికే గ్రామసభలు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలవు తున్నందున రైతులు ముందస్తుగా బుకింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలి. మధ్యాహ్న భోజన పథకంలో మెనూను కచ్చితంగా పాటించాలి. డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి బడిబాట పట్టించాలి. వేసవి దృష్ట్యా ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి.?రహదారి భద్రతపై 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో వినూత్నంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామంలో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ కారణంగా కిడ్నీ వ్యాధులు పెరుగుతున్నాయని సర్పంచులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన తక్షణమే స్పందించారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి ఆ గ్రామానికి వెంటనే సురక్షితమైన నీటిని అందించాలని ఆదేశించారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి

చేయూత వంటి పథకాల్లో అర్హులకు మాత్రమే లబ్ధి చేకూరేలా పర్యవేక్షణ ఉండాలని, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. ఏటా మోడల్ గ్రామాలను ఎంపిక చేస్తున్న నేపథ్యంలో, తమ గ్రామాలు ఆ జాబితాలో ఉండేలా పోటీతత్వంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పాల్వంచలో కామ్రేడ్ బరపటి సీతారాములు వర్ధంతి



ఖమ్మం, ఏప్రిల్ 16: పాల్వంచకు చెందిన బరపటి సీతారాములు 18వ వర్ధంతిని సిపిఎం పాల్వంచ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి వర్గ కమిటి సభ్యులు కాతోజు సత్య అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటి సభ్యుడు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. పాల్వంచ పరిసర ప్రాంత గిరిజన, రైతు కూలి సమస్యలపై నిరంతరం అలుపెరగని పోరాటం చేసిన ధన్యజీవి బరపటి సీతారాములు అని, పార్టీ నిర్మాణం పట్ల, పోరాటాల పట్ల పూర్తి అవగాహనతో పనిచేసే వారని కొనియాడారు. అలాంటి నిర్మాణ దక్షుడిని కోల్పోవడం పార్టీకి తీరని నష్టం అని ఇప్పటి మత ఉన్మాద, దేశద్రోహులు అధికారంలో ఉన్న సమయంలో బరపటి సీతారాములు ఆశయాలకు అనుగుణంగా పని చేయడమే ఆయానికిచ్చే నిజమైన నివాళి అన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.జ్యోతి మాట్లాడుతూ నేటి ఉద్యమకారులకు స్ఫూర్తి ప్రదాత ఈ మండలంలో ఉన్న గిరిజనుల కోసం ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి వారి కుటుంబంలో ఒక్కటిగా ఉండేవారు కొత్తగూడెం మార్కిస్ట్ పార్టీ నిర్మాత ఆయన బరపాటికి విప్లవ నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్, కొండబోయిన వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి పొదిలి తులసి రామ్, కార్యదర్శి వర్గ సభ్యులు వి.వాణి, ఎస్‌కే. నిరంజన్, పట్టణ కమిటీ సభ్యులు బి.మాధవి. ఇంజ రాములు, ఇ.రాములు, సీనియర్ నాయకులు టి.కృష్ణమూర్తి, ఎం.వీ.అప్పారావు. శంకరన్న పాల్గొన్నారు.

# తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సహకారం అందిస్తాం : కేటీఆర్




హైదరాబాద్, ఏప్రిల్ 15: వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడంతో పాటు క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు

కేసీఆర్ జన్మదినం సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల విజేతలకు చెక్‌లు, ట్రోఫీలను హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సమగ్ర క్రీడా పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ కప్ స్ఫూర్తితో వచ్చే ఏడాది కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ గులాబీ శ్రేణు లను, కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులను అభినందించారు.

**ఓరుగల్లు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిం చాలి : దాస్యం వినయ్ భాస్కర్**

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 8 ఏండ్లుగా కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పేద క్రీడాకారులకు చేయూతనందిస్తున్నామని పేర్కొన్నారు.

**విజేతలకు చెక్‌లు, ట్రోఫీల ప్రదానం**

కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల్లో టోర్నీ విన్నర్‌గా నిలిచిన 51వ డివిజన్ జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన 49వ డివిజన్ జట్టుకు కేటీఆర్ చేతుల మీదుగా నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. డిపార్ట్మెంట్ క్రికెట్ విభాగంలో విన్నర్‌గా నిలిచిన అంజలి కిడ్నీ కేర్ సెంటర్ హాస్పిటల్ జట్టుకు, రన్నర్-అప్‌గా నిలిచిన సంకీర్తన హాస్పిటల్ జట్టుకు కూడా ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ క్రికెట్ అకాడమీ ఫౌండర్ చైర్మన్ ఫారుక్ అలీ, కేసీఏ సభ్యులు మాజీద్, వీరు, సిరాజ్, రాజేష్, రాంబాబు, 51వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్ రావు, ప్రెసిడెంట్ ఫిరోజ్, 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మూటిక రాజు, యాదగిరి, పులి రజనీకాంత్, జోరిక రమేష్, నయీముద్దీన్, ఇమ్మడి రాజు, దువ్వ కనకరాజు, ఇస్మాయిల్, కేశోజు ప్రణయ్, చిన్నా, రాంమూర్తి, రాకేష్ యాదవ్, వినీల్ రావు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఒక మంత్రికి 10 పర్సెంట్ అనే పేరుంది.. నీ ప్రభుత్వం కూలేందుకు రెడీగా ఉంది : మోత్కుపల్లి నర్సింహులు సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 15: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేం అలసిపోయాం. మీరు పెట్టే అవమానం.. ఈ వ్యవస్థలో మాకు జరిగే అన్యాయాన్ని, అవమానాన్ని చక్కదిద్దే స్థితిలో మీరు లేరు. కారణమేంటో మీరే చెప్పాలి. దీని క్కారణమేంటి.. నీ వెనుక గుంతలు తవ్వుతున్నరు.. నల్లికుట్లోళ్లు ఎవరు .. చెప్పమంటవా.. నీ గవర్నమెంట్ కూలిపోవడానికి చాలా సిద్ధంగా ఉంది. నువ్వు ఒక్కడివే పనిచేస్తే కుదరదు కదా.. వర్గీకరణ అయిన తర్వాత కూడా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సమావేశాలు పెడితే నువ్వేమైనా చేయగలిగావా.. అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

అసలు అవినీతి పరులను ఒక్కన్నన్నా నువ్వు తీసేసినవా.. ఒక్కడి మీదనన్నా నువ్వు యాక్షన్ తీసుకున్నవా.. అసలు ఎవరు అవినీతి పరులు.. ఈ గుంతలు తవ్వేటోడు ఎవరు.. అవినీతిలో 10 శాతం అని పేరు పడ్డ మంత్రి ఎవరు.. అసలు నీ పార్టీ ఎట్లొస్తది. ఇంత బహిరంగ అవినీతి రాష్ట్రంలో ఏ మూలకెళ్లి ఎవరిని అడిగినా.. ఒక మంత్రికి 10 పర్సెంట్ అనే పేరుంది ఆయనకు.. 10 పర్సెంట్ అంటే ఆయన పేరు చెబుతురు జనం. మరి ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోతున్నవ్ నువ్వు.

ఒక వ్యక్తి ఎస్సీ, బీసీ, ఓసీ ఎవరైతే ఏంది.. అవినీతి పరుడు ఎవరైనా తీసేయాల్సిందే. ఎందుకు తీసేయ్యలేకపోతున్నవ్.. నీకు ముఖ్యమంత్రి పదవే ముఖ్యమా.. నీ పదవి ఉండాలన్నా.. ప్రజలు నీవెంబడి ఉండాలే కదా.. ప్రజలు నీ వెంబడి ఉండాలంటే అవినీతి పరులకు అంతం పలకాలి కదా.. ఈ గొయ్యి తవ్వుతున్నది ఎవరు.. ఇంత అవినీతి పరుడు ఉన్న ప్రభుత్వంఎట్లా నడుస్తదని ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాల గుట్టురట్టు



ఆదిలాబాద్, ఏప్రిల్ 16:నకిలీ, అనుమతిలేని పత్తి విత్తనాలు , నిషేదిత గడ్డి మందు లాంటివి ఎవరు విక్రయించినా, వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాల కేసుకు సంబంధించిన వివరాలను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

బోయపల్లి బోర్డు జాతీయ రహదారి సమీపంలో ఆటోలో బెల్లంపల్లి నుంచి తాండూర్‌కు నకిలీ పత్తి విత్తనాలను డంపు చేస్తున్నారనే సమాచారంతో తాండూర్ ఎస్సై కే ప్రసాద్, వ్యవసాయాధికారిణి సుష్మా, సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేయగా ఆటోలో నకిలీ పత్తి విత్తనాలు లభ్యమైనట్లు గుర్తించారని తెలిపారు. రూ. 3లక్షలు విలువగల 150 కేజీల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

భీమిని మండలం నారాయణపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తు బోయపల్లి బోర్డు గ్రామంలో ఉంటున్న పూస సుబ్బారావు, తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒగరి సమ్మయ్య, తాండూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మగ్దూంను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరు కొనుగోలుదారులు నకిలీ పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా గుంటుపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు డీసీపీ వివరించారు.

గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లుగానీ అమ్ముతున్నట్లుగాని సమాచారం తెలిస్తే తెలియజేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమావేశంలో తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది, తాండూర్ మండల వ్యవసాయాధికారిని సుష్మ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని ప్రోదిచేస్తూ 'పరిశుభ్రత పక్షోత్సవం-2026'కు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శ్రీకారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:పార్లమెంటు సమావేశాల సంబంధిత కార్యకలాపాల్లో తలమునకలైన నేపథ్యంలో 'పరిశుభ్రత పక్షోత్సవం-2026ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నిర్ణీత తేదీకన్నా ఒక రోజు ముందుగా ఇవాళే ప్రారంభించింది. స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని ప్రోదిచేస్తూ పరిశుభ్ర, ఆరోగ్యకర పని వాతావరణం ఏర్పరిచేందుకు ఉద్దేశించిన ఈ పరిశుభ్రత ఉత్సవాలను 15 రోజులపాటు నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ నికుంజ బిహారీ ధల్ తమ శాఖలోని అధికారులు సహా మొత్తం సిబ్బందితో పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకర జీవన శైలి, వ్యర్థాల సమర్థ నిర్వహణ తదితరాల దిశగా దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించేందుకు తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఈ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించాల్సిన కార్యకలాపాల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఇప్పటికే అధికారులకు, సిబ్బందికి అందింది. దీనికి అనుగుణంగా నిర్దిష్ట ఫలితాలు రాబట్టగల చట్రాన్ని వారు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛ భారత్ అభియాన్ ఆదర్శాలకు కట్టుబడిన మంత్రిత్వశాఖ క్రమబద్ధ కార్యక్రమాలు, ప్రచారం ద్వారా పరిశుభ్రత, సుస్థిరతలను ప్రోత్సహిస్తుంది.

## పదిహేడేళ్ల నాటి వన్యప్రాణి నేరం కేసులో దోషిగా తేలిన శహ్‌తుశ్ వ్యాపారి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:భారత వన్యప్రాణి సంబంధిత నేరాల నియంత్రణ ఆదేశాల్లో చరిత్రాత్మక ఆదేశం ఇది.. చట్టవిరుద్ధంగా శహ్‌తూశ్ శాలువాలను ఎగుమతి చేయడానికి ప్రయత్నించి, 'వన్యప్రాణి పరిరక్షణ చట్టం-1972'ను అతిక్రమించారంటూ జైపూర్‌లోని ఒక చిత్రశాల యజమానిని దోషిగా న్యూఢిల్లీలోని ఓ న్యాయస్థానం నిర్ధారించింది. శహ్‌తుశ్ శాలువా తయారీకి.. టిబెట్‌లో సంచరించే కొమ్ముల జింక (పాంథలోప్స్ హాగ్‌సోనీ) వెంట్రుకలను ఉపయోగించారని తేలింది.

జైపూర్‌లోని ఇండియన్ ఆర్ట్ గ్యాలరీ యజమాని సయ్యద్ షాహిద్ అహ్మద్ కాశానీకి వ్యతిరేకంగా రావుజ్ ఎవెన్యూ జిల్లా న్యాయస్థానాల చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు 2026 మార్చి నెల 12న తీర్పును ప్రకటించారు. దీంతో, 2008లో నమోదైన కేసును ఎట్టకేలకు కొలిక్కి తీసుకువచ్చినట్లయింది.

టిబెట్‌లో కనిపించే కొమ్ముల జింక స్థానికంగా చిరూ పేరిట ప్రసిద్ధం. దీనిని వన్యప్రాణి (పరిరక్షణ) చట్టం-1972 లోని షెడ్యూలు ఎ లో చేర్చారు. స్థానిక చట్టాల్ని అనుసరించి, దీంతో వ్యాపారం చేయడంపై కఠిన నిషేధాజ్ఞలను అమల్లోకి తెచ్చారు. సీఐటీఈఎస్‌లో పేర్కొన్న ప్రకారం, 1975 నుంచి శహ్‌తుశ్ శాలువాల వ్యాపారాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిషేధించారు. సీఐటీఈఎస్‌పై సంతకం చేసిన దేశాల్లో భారత్ కూడా ఉంది.

వన్యప్రాణి నేర నియంత్రణ మండలి (డబ్ల్యూసీసీబీ), కేంద్ర పరిశోధక మండలి (సీబీఐ), భారత కస్టమ్స్, వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ (డబ్ల్యూఐఐ)లు కలిసికట్టుగా చక్కని సమన్వయంతో సుమారు 17 సంవత్సరాల పాటు ముందుకు సాగడం ఈ కేసు ప్రత్యేకత. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 1,290 శహ్‌తుశ్ శాలువాలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నట్లు డబ్ల్యూసీసీబీ గుర్తించింది. 2009 ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో సీబీఐకి చెందిన ఈఓయూ-వీ బ్రాంచిలో ఫిర్యాదును దాఖలు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణ జరిగిన వన్యప్రాణి సంబంధిత తొలి నేరం ఇది.

పశ్మీనా శాలువలను ఎగుమతి చేయాలంటే వన్యప్రాణి అధికారుల వద్ద నుంచి నిరభ్యంతర ధ్రువపత్రాన్ని పొందాలి. ఈ కారణంగా ఉత్తర ప్రాంత డబ్ల్యూసీసీబీ ఇన్స్‌పెక్టర్ ఆరతీ సింగ్ ఎగుమతి సరకును పరిశీలించి, ఆ శాలువాలను శహ్‌తుశ్ ఉన్నితో తయారు చేశారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. 41 శాలువాల రూపకల్పనలో టిబెట్ జాతి జింకల వెంట్రుకల్ని ఉపయోగించారని డెహ్రాడూన్‌లోని భారతీయ వన్యప్రాణి సంస్థ (డబ్ల్యూఐఐ) ఫోరెన్సిక్ పరీక్షలో తేలింది. మొదటి దశలో 5 శాలువాల్లోనూ, రెండో దశ దర్యాప్తులో 36 శాలువాల్లోనూ ఆధారాలు లభించాయి.

డబ్ల్యూసీసీబీ (ఉత్తర ప్రాంతం) ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టరు శ్రీ రమేశ్ కుమార్ పాండే ఫిర్యాదు దాఖలు చేశారు. ఆయనే సీబీఐలో లాంఛనంగా ఫిర్యాదు సమర్పించడంతో పాటు, డబ్ల్యూఐఐకి ఫోరెన్సిక్ నమూనాలను పంపించే పనిని కూడా తీసుకున్నారు. శ్రీ పాండే ప్రస్తుతం ఏడీజీ వైల్డ్‌లైఫ్‌గానూ, డబ్ల్యూసీసీబీలో డైరెక్టర్ (ఎక్స్-అఫీషియో)గానూ సేవలను అందిస్తున్నారు. ఈ కేసులో ఆయన పూర్తి స్థాయి సహకారాన్ని అందించారు.

శాలువాలను కస్టమ్స్ విభాగం స్వాధీనం చేసుకొని, సాక్ష్యాలను సేకరించే పనిలో నిమగ్నమైంది. జప్తు చేసిన శాలువాల గురించి డబ్ల్యూఐఐలోని వైల్డ్‌లైఫ్ ఫోరెన్సిక్ విభాగం నివేదికను ఇవ్వడంతో పాటు, టిబెట్‌కు చెందిన కొమ్ముల జింక వెంట్రుకల ఉనికిని కూడా గుర్తించారు. అప్పటి సీబీఐ అధికారి శ్రీ సంజయ్ దూబే దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. ఈయన సాక్ష్యాలను సేకరించడం మొదలు, న్యాయస్థానంలో వాదనల్లో పాలుపంచుకోవడం వరకు.. అన్ని వ్యవహారాల్లోనూ చురుకుగా పాల్గొన్నారు.

డబ్ల్యూసీసీబీ ఇన్స్‌పెక్టర్ ఆరతీ సింగ్ సకాలంలో సరకును గుర్తించి, జప్తు చేయడంలో ముఖ్య పాత్రను పోషించారు. నిపుణులు అందించే సాక్ష్యాన్ని డబ్ల్యూఐఐకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.పి. గోయల్ సమకూర్చారు. ఇది న్యాయస్థానం ప్రశ్నల వేళ వాస్తవాన్ని నిర్ధారించడంలో తోడ్పడింది.

యంత్రాన్ని ఉపయోగించి తయారు చేసిన పశ్మీనాను ఢిల్లీ విక్రేత వద్ద నుంచి కొనుగోలు చేయడమే తన వంతని నిందితుడు తెలిపాడు. ఇది మినహా తాను ఎలాంటి తప్పూ చేయలేదన్నాడు. నిందితుని తరపు న్యాయవాదులు ఘటన జరిగిన స్థలంలో పరీక్షల పైనా, సాక్ష్యాల నిర్వహణపైనా ప్రశ్నలను సంధించారు. అయితే, ఆ అంశాలన్నింటినీ న్యాయస్థానం కొట్టివేసింది. డబ్ల్యూఐఐ అందించిన సాక్ష్యాల నివేదికలను సమర్థించింది. నిర్దోషి అని చెప్పుకొంటున్న వాదనలతో నిందితుని ప్రవర్తన తులతూగడం లేదని పేర్కొంది.

నిందితునికి సెక్షన్ 49బీ ((1)/51(1ఏ) కింద 3 సంవత్సరాల జైలుశిక్షనీ, రూ.50,000 జరిమానాతో పాటు సెక్షన్లు 40, 49ల కింద చెరో 2 సంవత్సరాల అదనపు కారాగార వాసాన్నీ (ఈ శిక్షలన్నీ ఏకకాలంలో వర్తిస్తాయి) విధిస్తున్నట్లు తీర్పు చెప్పింది. స్వాధీనం చేసుకున్న శాలువాలను ప్రభుత్వ ఆస్తిగా పరిగణిస్తారు.

ఈ కేసు శహ్‌తూశ్ దొంగరవాణా ఆరంభిక దశకు సంబంధించింది. దీని దర్యాప్తును డబ్ల్యూసీసీబీ కోరిన మీదట సీబీఐ చేపట్టింది. భారత్‌లో వన్యప్రాణి చట్టాల పటిష్ఠ అమలుకు ఒక ఏకీకృత దృష్టికోణాన్ని అనుసరించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ కేసు స్పష్టం చేస్తోంది. అంతేకాక, ఒక దశాబ్ద కాలానికి పైగా దర్యాప్తు చేసే సామర్థ్యం, పరిశోధన, ఫోరెన్సిక్స్, విచారణను కొనసాగించే సామర్థ్యం.. ఇవన్నీ కూడా ఇమిడి ఉండాలని ఈ కేసు చాటిచెబుతోంది.

## మలయాళ చిత్రం అచ్చప్పాస్ ఆల్బమ్‌ను 2026 ఏప్రిల్ 24న దేశవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన ఎన్ఎఫ్‌డీసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:మలయాళ చిత్రం అచ్చప్పాస్ ఆల్బమ్ (గ్రాండ్ పాస్ ఆల్బమ్)ను విడుదల చేసేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ చలన చిత్ర అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) సిద్ధమవుతోంది. కాల్పనిక కుటుంబ నేపథ్యం, హాస్యం, భావోద్వేగాల మేళవింపుతో టైమ్ ట్రావెల్ కథాంశంగా తెరకెక్కిన ఈ చిత్రం 2026 ఏప్రిల్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ చిత్రానికి దీప్తి పిళ్లై శివన్ దర్శకత్వం వహించగా సంజీవ్ శివన్, అనిర్బన్ భట్టాచార్య, ఉమేష్ నాయర్ రచనా సహకారం అందించారు. గతాన్ని పునర్దర్శించాలని అందరికీ సహజంగా ఉండే ఆసక్తిని ఈ చిత్రం అన్వేషిస్తుంది. అనుకోని పరిస్థితుల్లో విధి ఆడిన వింత నాటకం వల్ల ఒకరి జీవితంలోకి మరొకరు అడుగుపెట్టే తండ్రీకొడుకుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ మార్పే.. ఆలోచనల్లో, ఎంపికల్లో తరాల మధ్య ఉన్న అంతరాన్ని అర్థవంతంగా, హాస్యభరితమైన నేపథ్యంలో ఆవిష్కరిస్తుంది.

ఈ చిత్రంలో ప్రముఖ నటుడు మోహన్ ఆగాషేతో పాటు అంజనా అప్పుకుట్టన్, ఆదినాథ్ కొఠారే, ప్రియాంక నాయర్, సిధాంశు సంజీవ్ శివన్ తదితరులు నటించారు. సినిమాటోగ్రాఫర్ మనోజ్ పిళ్లై, జాతీయ పురస్కార గ్రహీత శ్రీకర్ ప్రసాద్, సంగీత దర్శకుడు గుల్రాజ్ సింగ్ లాంటి అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేశారు.

'సరళంగా, ఆకట్టుకొనే టైం ట్రావెల్ కథతో లోతైన మానవ సంబంధాలను ఈ చిత్రం అన్వేషిస్తుంది. ఈ కథను వెండితెరపైకి తీసుకొచ్చేందుకు సహకరించిన ఎన్ఎఫ్‌డీసీకి కృతజ్ఞతలు" అని దర్శకురాలు దీప్తి పిళ్లై శివన్ అన్నారు.

## ఖనిజాల రాయితీ నియమాలకు భారీ సవరణలను ప్రకటించిన గనుల మంత్రిత్వ శాఖ...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:ఖనిజాల (అణు, హైడ్రో కార్బన్ శక్తి ఖనిజాలు మినహా) రాయితీ (మూడో సవరణ) నియమాలు-2026ను ఏప్రిల్ 10న గనుల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. బ్యాండెడ్ హెమటైట్ క్వార్ట్‌జైట్ (బీహెచ్‌క్యూ), బ్యాండెడ్ హెమటైట్ జాస్పర్ (బీహెచ్‌జే) సహా.. నిర్దేశిత విలువ కన్నా తక్కువగా ఉన్న హెమటైట్ ఇనుప ఖనిజపు సగటు అమ్మకపు ధర ప్రచురణకు సంబంధించిన పద్ధతిని ఈ నియమాలు తెలియజేస్తున్నాయి.

తవ్వకాల్లో లభించిన పదార్థాన్ని ఏ పరిమితి కన్నా తక్కువగా ఉంటే వ్యర్థంగా వదిలేయొచ్చో తెలిపే కనిష్ట స్థాయే ఒక ఖనిజపు నిర్దేశిత పరిమితి విలువ (థ్రెషోల్డ్ విలువ). హెమటైటిక్ ఇనుప ఖనిజపు నిర్దేషిత పరిమితి (థ్రెషోల్డ్) విలువను 45% ఈవం (కనిష్టం)గా నిర్ణయించారు. ఈ విలువ కన్నా తక్కువ నాణ్యత కలిగిన ఇనుప ఖనిజం నిల్వలు మన దేశంలో భారీగా ఉన్నాయి. ఇందులో కొంత భాగం బీహెచ్‌క్యూ లేదా బీహెచ్‌జే రూపంలో ఉంది. ఇవి ఇనుప ఖనిజానికి ప్రధాన ఆధార శిలలు. అయితే ప్రాసెసింగ్, ఖనిజ శుద్ధి సాంకేతికత మెరుగుపడడంతో.. బీహెచ్‌క్యూ, బీహెచ్‌జేలతోపాటు నిర్దేశిత పరిమితి విలువకు కింద ఉన్న ఇనుప ఖనిజ వనరులు శుద్ధి ప్రక్రియకు అనుకూలంగా మారి, ఉక్కు తయారీకి అవసరమైన అత్యుత్తమ గ్రేడ్ ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసేందుకు అవకాశముంది.

ఇలాంటి తక్కువ నాణ్యత గల ఇనుప ఖనిజాన్ని శుద్ధి చేసే ప్రక్రియను ప్రోత్సహించడం కోసం ఒక సరైన విధానం అవసరమైంది. నిబంధనల్లో ప్రస్తుత సవరణలకు ముందు.. నిర్దేశిత పరిమితి విలువ (అంటే 45% ఈవ) కన్నా తక్కువ నాణ్యత కలిగిన హెమటైట్ ఇనుప ఖనిజం (బీహెచ్‌క్యూ, బీహెచ్‌జే సహా) సగటు అమ్మకపు ధరను (ఏఎస్పీ) ప్రచురించేందుకు ఎలాంటి కచ్చితమైన పద్ధతీ లేదు. దాంతో నిర్దేశిత పరిమితి (థ్రెషోల్డ్) విలువకు పైన ఉన్న అతి తక్కువ గ్రేడ్ (అంటే 45% నుండి 51% ఈవ (గ్రేడ్) సగటు ధరనే వీటికి కూడా వర్తింపజేసేవారు.

ఇలా నిర్దేశిత పరిమితి విలువకు తక్కువగా ఉన్న ఖనిజాలపై కూడా నాణ్యమైన ఖనిజపు సగటు అమ్మకపు ధరల ప్రాతిపదికన రాయల్టీ, వేలం ప్రీమియం వంటివి విధించడం వల్ల.. ఆ ఖనిజాలను శుద్ధి చేయడం ఆర్థికంగా భారమయ్యేది. నిబంధనల్లో ప్రస్తుత సవరణ ఈ సమస్యను పరిష్కరిస్తుంది. దీని ప్రకారం.. నిర్దేశిత పరిమితి (థ్రెషోల్డ్) విలువ కన్నా తక్కువ ఈవ కంటెంటు ఉన్న హెమటైట్ ఇనుప ఖనిజపు సగటు విక్రయ ధరను (ఏఎస్పీ) లెక్కిస్తారు

## టోలింగ్ అనుబంధ విస్తారిత వ్యవస్థలో సమాచార ఖచ్చితత్వాన్ని బలోపేతం చేయడానికి వాహన నమోదు సంఖ్యలను సరిచూసే దిశగా ఎన్‌హెచ్ఏఐ చర్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:ఫాస్టాగ్ (ఈయూజీఐ)లను జారీ చేస్తున్న బ్యాంకులు ఆ ఫాస్టాగులతో ముడిపెట్టిన వాహన నమోదు సంఖ్యల (వీఆర్ఎన్‌స్)ను వెంటనే సరిచూసి, అవి సక్రమంగా ఉన్నాయని ప్రకటించాలంటూ భారత జాతీయ రహదారి ప్రాధికరణ సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఆదేశాలు జారీ చేసింది. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ (ఈటీసీ) వ్యవస్థలో సమాచార యథార్థతని, విశ్వసనీయతని పెంచడానికి ఎన్‌హెచ్ఏఐ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఫాస్టాగ్ రీడర్ నమోదు చేసిన వీఆర్ఎన్ వాహనం నంబర్ ప్లేటుపై ప్రదర్శించిన వాస్తవిక నమోదు సంఖ్యతో సరిపోలడం లేదని ఫిర్యాదులు అందడంతో, ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.


ఈ విధమైన అంతరాలు నేర నియంత్రణ యంత్రాంగాల్ని బలహీనపరిచే ఆస్కారం ఉండడంతో పాటు, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని ఎగవేసేందుకు దారి తీసే ప్రమాదమూ ఉంది. అంతేకాదు, ఇవి మోటారు వాహనాల చట్టం-1988 కింద ఇతర శిక్షాత్మక నిబంధనల్ని అమలు చేయాల్సిన స్థితిని కల్పిస్తాయి.

ఇలాంటి పొంతన లేకపోయిన సందర్భాలు అనేకం వాహన్ (ఎంఓఆర్‌టీహెచ్) సమాచార నిధి (డేటాబేస్)తో ముడిపెట్టి ఫాస్టాగులను జారీ చేసే ప్రక్రియను ప్రారంభించడాని కన్నా ముందు జారీ చేసిన ఫాస్టాగులకు సంబంధించినవిగా గుర్తించారు. ఆ కాలంలో, క్రమబద్ధత యాత్రాంగాలు ఆశించిన స్థాయిలో లేక, పరిమితంగా మాత్రమే ఉండేవి. ప్రక్రియను మనుషుల ప్రమేయంతో పూర్తి చేయవలసి వచ్చేది. దీంతో వాహనాల గుర్తింపు రికార్డుల్లో సంభావిత పరస్పర వైరుధ్యాలు చోటు చేసుకున్నాయి.

త్వరలో మల్టీలేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) టోలింగ్ వంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను ప్రారంభించనున్న దృష్ట్యా, ఫాస్టాగులతో వీఆర్ఎన్ మ్యాపింగుకు సంబంధించిన యథార్థత్వాన్ని నిర్ధరించడం అత్యంత కీలకంగా మారిందని ఎన్‌హెచ్ఏఐ స్పష్టం చేసింది. ఎంఎల్ఎఫ్ఎఫ్ ప్రణాళికలో భాగంగా, నియమాలను లెక్కచేయని వాహనదారులకు ఎలక్ట్రానిక్ నోటీసులు (ఈ-నోటీసులు) జారీ చేయడం సహా నేర నియంత్రణ సంబంధిత కార్యకలాపాలను ఖచ్చితంగా, సరిచూసిన వాహన గుర్తింపు సమాచారం ఆధారంగా చేపట్టవలసి వస్తుంది.

ఈ సందర్భంలో, ఫాస్టాగులను జారీ చేసే బ్యాంకులు అన్నీ అవి జారీ చేసిన ఫాస్టాగులను వెనువెంటనే సరి అయినవిగా గుర్తించాల్సిందిగా, చెల్లుబాటు కాని వీఆర్ఎన్‌లతో జోడించిన ఫాస్టాగులుగా కనుగొన్న వాటిని బ్లాక్‌లిస్టులో పెట్టాల్సిందిగా ఆదేశించారు.

ఎలక్ట్రానిక్ పద్ధతిని ఉపయోగించి టోల్‌ను వసూలు చేసే వ్యవస్థను పారదర్శకంగా, నియమబద్ధంగా, కార్యనిర్వహణ పరంగా సమర్థమైందిగా అమలుచేసే విధంగా ఆ వ్యవస్థని పటిష్ఠపరచాలన్న నిబద్ధతతో ఎన్‌హెచ్ఏఐ పనిచేస్తోంది. సేకరించే సమాచారంలో యథార్థతను మెరుగుపరచడానికి, ఫాస్టాగులను దుర్వినియోగపరచడాన్ని అడ్డుకోవడానికి, దేశవ్యాప్తంగా జాతీయ రహదారులను ఉపయోగించుకొనే వర్గాలకు మరింత మేలైన అనుభవాన్ని అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.


# బహుముఖ ప్రజ్ఞాశాలి బెంజమిన్ ఫ్రాంక్లిన్

## ఏప్రిల్ 17...బెంజమిన్ ఫ్రాంక్లిన్ వర్ధంతి

బెంజమిన్ ఫ్రాంక్లిన్ (జనవరి 17, 1706 - ఏప్రిల్ 17, 1790) అమెరికా విప్లవంలో పాల్గొని అమెరికా దేశాన్ని, రాజ్యాంగాన్ని స్థాపించిన విప్లవకారుల్లో ఒకడు. ఆయన బహుకళా ప్రావీణ్యుడు, గొప్ప రచయిత, చిత్రకారుడు, రాజకీయ నాయకుడు, శాస్త్రవేత్త, మేధావి. ఆయన కనిపెట్టిన వాటిలో "ఛత్వారపు కళ్ళద్దాలు", "ఓడొమీటర్ (ప్రయాణించిన దూరాన్ని సూచించేది)" మొదలగునవి చాలనే ఉన్నాయి. అగ్నిమాపక విభాగం, తపాలా సేవ, ఆసుపత్రి, లైబ్రరీ, అకాడమీ స్థాపనలో ఫ్రాంక్లిన్ ప్రధాన పాత్ర పోషించాడు. ఫ్రాంక్లిన్ "మొదటి అమెరికన్" అనే బిరుదుని కూడా పొందాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ 1706 జనవరి 17 ఆదివారం మసాచుసెట్స్‌లోని బోస్టన్‌లో జన్మించాడు. పిడుగులు పడి ఎన్నో విలువైన కట్టడాలు కూలిపోతూ ఉండడాన్ని చూసిన ఆయన, పిడుగుల బారి నుండి కట్టడాలను కాపాడటం కోసం "లైట్నింగ్ కండక్టర్" లను తొలిసారిగా 1752లో రూపొందించాడు. సముద్రం మీద కూడా ఎన్నో రకాల పరిశోధనలు చేసి సముద్రంలో చమురు వేస్తే దాని అలజడి తగ్గుతుందని కనుగొన్నాడు. ఆయన రూపొందించిన స్టౌవ్ లు, బై ఫోకల్ కంటి అద్దాలు ఇప్పటికీ వాడబడుతూ ఉన్నాయి. ఆమ్లీకృతంగా ఉన్న భూములలో సున్నం కలిపి తటస్థం చేయవచ్చని సూచించాడు. గాలి, వెలుతురు లేని చోట్ల అంటువ్యాధులు త్వరగా ప్రబలుతాయని కూడా హెచ్చరించాడు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ తండ్రి బెన్ బోధకుడిగా మారాలని కోరుకున్నాడు. ఎనిమిదేళ్ళ వయసులో అతన్ని వ్యాకరణ పాఠశాలకు పంపాడు. పది సంవత్సరాల వయస్సు వరకు కొత్త పాఠశాలలోనే ఉన్నాడు. తన పాఠశాల రోజుల నుండి, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఒక నావికుడు కావాలను కున్నాడు. అతని తండ్రి అంగీకరించ లేదు.

బెన్‌ను తన అన్నయ్య ప్రింటింగ్ షాపులో నేర్చుకోవడానికి పంపాడు. బెన్ ఫిలడెల్ఫియా, తర్వాత ఇంగ్లాండ్‌లో ఈ అభ్యాసాన్ని కొనసాగించాడు. చివరికి ఫిలడెల్ఫియాలో తన సొంత ముద్రణ వ్యాపారాన్ని స్థాపించాడు.



రాజకీయాలతో సంబంధం పెట్టుకునే ముందు, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఫిలడెల్ఫియాలో ఒక ప్రింటింగ్ షాపును కలిగి, 1747 లో ప్రింటింగ్ నుండి రిటైర్ అయ్యాక, ఫిలడెల్ఫియా యొక్క పోస్ట్ మాస్టర్, బ్రిటిష్ నార్త్ అమెరికా కో-డిప్యూటీ పోస్ట్ మాస్టర్ గా కూడా పనిచేశాడు. 1775 లో, అతను యునైటెడ్ స్టేట్స్ యొక్క మొదటి పోస్ట్ మాస్టర్ జనరల్ అయ్యాడు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ సుదీర్ఘ ఆవిష్కరణల జాబితాలో బైఫోకల్స్, మెరుపు రాడ్, గ్లాస్ అర్మోనికా, ఒక లైబ్రరీ కుర్చీ, ఈత రెక్కలు, దీర్ఘకాల పరికరం, ఫ్రాంక్లిన్ స్టవ్, కాథెటర్ తదితరులు ఉన్నాయి. 1741 లో, బెన్ ఫ్రాంక్లిన్ స్టవ్ అనే ఇనుప కొలిమిని కనుగొన్నాడు.

బెన్ వయసు పెరిగేకొద్దీ అతని దృష్టి క్షీణించింది. అతను చదవడానికి ఇష్టపడ్డాడు. రెండు జతల గ్లాసుల మధ్య మారడం అలసి పోయాడు. ఒకటి విషయాలు దగ్గరగా చూడటానికి అతనికి సహాయపడింది, మరొకటి దూరంగా చూడటానికి. అందువల్ల అతను రెండు జతల నుండి కటకములను సగానికి కట్ చేసి, ఆపై ప్రతి లెన్స్‌లో సగం ఒకే చట్రంలో ఉంచి, బైఫోకాల్స్‌ను కనుగొన్నాడు.

తన జీవిత కాలంలో, బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనేక రచనలు చేశాడు. బాగా తెలిసిన వాటిలో పూర్ రిచర్డ్ యొక్క అల్మానాక్ , రిచర్డ్ సాండర్స్ అనే మారుపేరుతో రాసిన వార్షిక ప్రచురణ తదితరాలు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీ, పెన్సిల్వేనియా హాస్పిటల్ మరియు ఫ్రాంక్లిన్ మరియు మార్షల్ కాలేజీని స్థాపించారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తన జీవిత కాలంలో అనేక అంతర్జాతీయ ప్రయాణాలు చేశాడు. 1776-84: ఫ్రాన్స్‌కు అమెరికన్ కమిషనర్‌గా పనిచేస్తూ, ఫ్రాన్స్‌తో కూటమి ఒప్పందంపై చర్చలు జరిపారు.

ఫ్రాంక్లిన్ సుభాషితాలలో....

మరణానంతరం కూడా గుర్తుండాలంటే చదవదగిన పుస్తకాలు వ్రాయి లేదా వ్రాయదగిన పనులు చెయ్యి. తృప్తి పేదవాడ్ని ధనవంతుడిగా చేస్తుంది. అసంతృప్తి గొప్పవాణ్ణి పేదవాడిగా మారుస్తుంది.

కోపంతో మొదలుపెట్టిన పని తప్పనిసరిగా అవమానాల పాలౌతుంది. ఖాళీ సమయం కావాలనుకుంటే సమయాన్ని సరిగ్గా వినియోగించు కోవాలి. కారణం లేకుండా ఎవరికి కోపం రాదు. అయితే ఎప్పుడో గాని సరైన కారణం ఉండదు. సహనం కలవాడు ఏదైనా సాధించగలడు. మంచి యుద్ధం, చెడ్డ శాంతి అనేది ఎప్పుడూ ఉండదు...

ఆయనకు జీవిత కాలంలో ఎన్నో గౌరవ పురస్కారాలు లభించాయి. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ లో అతను సభ్యుడిగా ఎన్నుకోబడ్డాడు.

అమెరికా స్వాతంత్ర్యం కోసం కృషి చేసి, 1766 జూలై 4న స్వాతంత్ర్య ప్రకటన చేస్తూ సంతకాలు చేసిన వారిలో ఫ్రాంక్లిన్ కూడా ఉన్నాడు. 1777 లో రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు ఇతను కూడా ఎంతగానో సహకరించాడు.

శాస్త్రవేత్తగా, రాజకీయవేత్తగా పరిణితి చెందిన ఆయన 1770 ఏప్రిల్ 17న మరణించాడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

---

# రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు కరీంనగర్‌లోని కోట రెజోనెన్స్ విద్యార్థులకు రావడం గర్వకారణం

## -చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

### విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సు డా చైర్మన్ కో మిటీ రెడ్డి నరేందర్ రెడ్డి




కరీంనగర్ ఏప్రిల్ 16: కరీంనగర్ లోని కోట ఇన్స్టిట్యూట్ వారి రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ కరీంనగర్ కు ఇంటర్ ఫలితాల ద్వారా రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిందని ఇది కరీంనగర్ కు గర్వకారణమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు కరీంనగర్ లోని రేకుర్తి లో గల కెపిఎస్ హైస్కూల్లో కోట రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు వచ్చిన సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు కరీంనగర్లో అనతి కాలంలోనే కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా గ్రామీణ ప్రాంతం నుండి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనె ఉద్దేశంతో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలనే సంకల్పంతో కోట విద్యాసంస్థలను స్థాపించిన చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డిని వ ం న స ా ా ర ి ా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు ప్రపంచంలో చదువును మించిన ఆయుధం లేదని కష్టపడి చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారని కోట విద్యాసంస్థలు భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు మరో అతిథి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అంజిరెడ్డి కరీంనగర్ కు రాష్ట్రస్థాయిలో కీర్తి తీసుకురావడం మనందరికీ గర్వకారణం అన్నారు ఫలితాలు రావడానికి ఇంకా టైం పడతది అనుకున్నా ఒక యజ్ఞంలా కృషిచేసి తొందరలోనే ఫలితం వచ్చేలా కృషిచేసిన డాక్టర్ డి అంజిరెడ్డి ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయి పరంపర కొనసాగించాలని కోరారు కోట ఇన్స్టిట్యూట్ అనేది ఇప్పుడు కరీంనగర్లో బ్రాండ్ ఇమేజ్ గా మారిందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు రాబోయే రోజుల్లో నెంబర్ వన్ గా కరీంనగర్ను తీర్చిదిద్దాలనే దానికి కోట విద్యాసంస్థలు బాటలు వేశాయని అన్నారు మరో అతిథి ట్రస్మ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి యొక్క క్రమశిక్షణ అతనిని బ్రాండ్ ఇమేజ్కు దగ్గరగా తీసుకు వెళ్లిందని అన్నారు కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు ఎక్కడికో వెళ్లకుండా స్మార్ట్ క్లాస్ విద్యా విధానం ద్వారా స్థానికంగానే మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో కోట విద్యాసంస్థలను స్థాపించి తొలి ప్రయత్నం లోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధ్యాపక బృందం ఇచ్చిన ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని సంచలనాలు నమోదు చేస్తామని డాక్టర్ డి అంజిరెడ్డి అన్నారు రాష్ట్రస్థాయిలో ఫస్ట్ మార్క్ సాధించిన ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గాలి సౌమ్యశ్రీ 469, ద్వితీయ సంవత్సరం కే సహన శ్రీ 995 , ద్వితీయ సంవత్సరం బైపీసీలోజి రోషిని 993 , బైపిసి ప్రథమ సంవత్సరంలో వి శరణ్య438 లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ట్రస్మా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు లు అందించి పూల గుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా కిసాన్ నగర్ హిందూ సమ్మేళనం

కరీంనగర్, ఏప్రిల్ 16:(నేటి నిజం ప్రతినిధి) కరినగర్ నగరంలో కిసాన్ నగర్ బస్తీలో చత్రపతి శివాజీ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు. గోపూజతో కార్యక్రమం అనంతరం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరినగర్ విభాగ ప్రచార ప్రముఖ్ తడి గొప్పల శంకరయ్య మాట్లాడుతూ సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజన తో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని , హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం , ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని,. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. హిందూల ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఆంఎస్ఎస్ వందేళ్లు దేశం, ధర్మం, సంస్కృతి , సాంప్రదాయాల పరిరక్షణ కోసం నిరంతరయంగా పని చేసిందన్నారు. నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్ధన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. సంఘం దేశహితం కోసం ఎల్లవేళలా పనిచేస్తూ ముందు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర సేవికాసమితి ప్రాంత శారీరక్ ప్రముక్ లెక్కల రమ మాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాతధర్మ పరిరక్షణ మనం దరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. అనంతరం. ముఖ్యఅతిథిగా హాజరైన మంగళ ఒపల్లి శ్రీనివాస్ శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమ్మేళనము కార్యనిర్వహణ సమితి అధ్యక్షుడు వనుల మహిపాల్ ప్రధాన కార్యదర్శి , గాజుల కృష్ణ జన జాగరణ సమితి అధ్యక్షుడు , ఎన్నం శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి మేంగని రాజయ్య , ఉపాధ్యక్షులు ఉప కార్యదర్శులు , బస్తీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# షాహీన్ జూనియర్ కాలేజ్ ఇంటర్ ఫలితాల్లో అద్భుత ఫలితాలు




కరీంనగర్, ఏప్రిల్ 16:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ లోని షాహీన్ జూనియర్‌కాలేజ్ 2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల పరీక్షల ఫలితాల్లో విశేష విజయాన్ని సాధించి, విద్యా రంగంలో తన సత్తా చాటింది. ఈ విజయంపై కాలేజ్ చైర్మన్ కాలేజ్ చైర్మన్ సయ్యద్ ఐజాజ్ అహ్మద్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది క్రమశిక్షణతో కూడిన బోధన, నాణ్యమైన విద్యా విధానం మరియు సమగ్ర ప్రణాళిక ఫలితమని పేర్కొన్నారు. ఎంపీసీ విభాగంలో సనా మహీన్ 1000 మార్కులకు 992 మార్కులు సాధించి కాలేజ్లో అగ్రస్థానంలో నిలిచింది. బైపీసీ విభాగంలో ఇకా ఫాతిమా 991 మార్కులతో ప్రతిభ చాటింది. జోయా ఫలక్ (988), షరియా అఫ్రీన్ (986), హానియా ఫర్హీన్ (985), అదీబా మహీన్ (985), జారా నిసార్ (984), సనూడియా (982) వంటి విద్యార్థులు కూడా విశిష్ట ఫలితాలు సాధించారు.మొదటి సంవత్సరం విభాగంలో సయ్యద్ అరీబ్ 470 మార్కులకు 466 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. షైఖ్ అనాస్ (465), సయ్యద్ జైద్ (462), ఉమయ్య తహ్మీద్ (461), ఖదీజా జర్బైన్ (437/440), సుమయ్య తహ్రీన్ (436/440), సనూఫా ఫాతిమా (436/440), బరీరా అమ్రీన్ (436/440), సుహాన్ అర్వేస్ (481/500) తదితరులు ప్రతిభ కనబర్చారు. ఇంకా 100 మందికి పైగా విద్యార్థులు భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం విషయాల్లో పూర్తి మార్కులు సాధించారు. సుమారు 34 శాతం మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు పొందడం విశేషం. ఈ సందర్భంగా సందర్భంగా చైర్మన్ సయ్యద్ ఐజాజ్ అహ్మద్ మాట్లాడుతూ, క్రమబద్ధమైన పాఠ్య ప్రణాళిక,వారంవారీ పరీక్షలు, నిరంతర పర్యవేక్షణ, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వంటి అంశాల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. దేశవ్యాప్తంగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను సమీకరించి విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దు తున్నామని చెప్పారు. తక్కువ కాలంలోనే ఈ సాయి ఫలితాలు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కరీంనగర్ ప్రజల మద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించేందుకు సంస్థ కట్టుబడి ఉందని వెల్లడించారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఘన విజయం

**-రాష్ట్రస్థాయి మార్కులతో మెరిసిన ఫలితాలు..**
**-శ్రీ చైతన్యవిద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి**

కరీంనగర్, ఏప్రిల్ 16:(నేటినిజం ప్రతినిధి) ఇటీవలఇంటర్మీడియట్ మొదటి మరియు రెండో సంవత్సరం ఫలితాల్లో కరీంనగర్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని సాధించారు. నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. రెండో సంవత్సరం ఫలితాల్లో గణిత, భౌతిక, రసాయన శాస్త్ర విభాగంలో 995 మార్కులతో బి. శశికుమార్, కె. మైత్రి, యు. చారు హాసిని అగ్రస్థానంలో నిలిచారు. 994 మార్కులు యం. సాత్విక, శ్రీనిత్య, డి. ప్రవల్లిక సాధించగా, 990కి పైగా మార్కులు 20 మంది విద్యార్థులు పొందారు. జీవశాస్త్ర విభాగంలో 994 మార్కులతో బి. లహరి, ఓ. శ్రీనివాసన్, సి. హెచ్. కార్తిక్ రాణించగా, 980కి పైగా మార్కులు 18 మంది సాధించారు. వాణిజ్య విభాగంలో పి. వల్లవి రాజయ్య 974, సి.ఇ.సి విభాగంలో అంజలి కిలేరి 984 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో గణిత విభాగంలో బి. ప్రశాంత్ గౌడ్ 468 మార్కులతో ముందంజలో నిలవగా, పలువురు విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించారు. జీవశాస్త్ర విభాగంలో డి. మెఘన, ఎ. సిద్దార్ 438 మార్కులు సాధించగా, ఇతరులు కూడా విశేష ఫలితాలు నమోదు చేశారు వాణిజ్య విభాగంలో పి. లిఖిత గుప్త 494, సి.హెచ్. శివాత్మిక రెడ్డి 490 మార్కులతో మెరిశారు. ఈ సందర్భంగా అధినేత మాట్లాడుతూ, నాణ్యమైన విద్య, పటిష్ట ప్రణాళికలు, అధ్యాపకుల సమర్థ బోధన, విద్యార్థుల కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.




ప్రతి సంవత్సరం ప్రవేశ పరీక్షల్లో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరిచి సంస్థకు మంచి పేరు తీసుకువస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# కేసీఆర్ కప్ తో క్రీడా స్ఫూర్తి వికాసం

**- బీఆర్ఎస్ నేత చెల్మెడ నరసింహారావు-**
**ఫైనల్ మ్యాచ్ లో కమాండర్స్ విజయం**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 16: (నేటినిజం ప్రతినిధి): యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న కేసీఆర్ -2026 టోర్నమెంట్ కీలకంగా మారిందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తెలిపారు. వేములవాడ పట్టణ మున్సిపల్ పరిధిలో నిర్వహించిన టోర్నమెంట్ ఫైనల్లో వేములవాడ కమాండర్స్, వేములవాడ రాయల్స్ జట్లు తలపడగా కమాండర్స్ విజేతగా నిలిచింది.విజేత జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.20 వేల బహుమతిని ఆయన అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా శ్రీకాంత్ రెడ్డి రూ.3 వేల బహుమతి అందుకోగా, బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా రాజు (టిల్లు), బెస్ట్ బౌలర్‌గా అతీక్ తలా రూ.1000 చొప్పున నగదు బహుమతులు అందుకున్నారు. ఇతర జట్ల క్రీడాకారులకు మెడల్స్‌ను అంద జేశారు.ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా యువతను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2001లో కేసీఆర్ పార్టీని స్థాపించి తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవా లని పిలుపునిచ్చారు. గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించడం క్రీడా స్ఫూర్తి లక్షణమని అన్నారు.కార్యక్రమంలో పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ & పీ గ్లోబల్ గురుగ్రామ్ డౌన్‌టౌన్‌లో నూతన హబ్ ప్రారంభం




హైదరాబాద్, ఏప్రిల్ 16: గురుగ్రామ్ (ఏప్రిల్ 16, 2026): ఎస్ & పీ గ్లోబల్ గురువారం గురుగ్రామ్ డౌన్‌టౌన్‌లో తన అత్యాధునిక కార్యాలయాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం నగరంలో కంపెనీ దీర్ఘకాలిక ఉనికిపై భారీ పెట్టుబడిగా నిలుస్తూ, భారతదేశాన్ని వ్యూహాత్మక టాలెంట్ హబ్‌గా మరింత బలోపేతం చేస్తోంది. ప్రస్తుతం దేశంలో 16,000 కంటే ఎక్కువ మంది ఎస్ & పీ గ్లోబల్ ఉద్యోగులు పనిచేసున్నారు. 1,90,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ కార్యాలయాన్ని సీనియర్ నాయకులు సౌగత సాహా అధ్యక్షుడు చీఫ్ డేటా ఆఫీసర్), యాన్ లె పాల్లెక్ అధ్యక్షుడు సేత్ ఫాక్స్ (డిజిటల్ టెక్నాలజీ సర్వీసెస్ ప్రారంభించారు. ఈ కొత్త కార్యాలయంలో టెక్నాలజీ, డేటా, ఆపరేషన్స్, కస్టమర్ సక్సెస్ విభాగాల్లో 3,500 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు హైబ్రిడ్ విధానంలో పనిచేస్తారు. సౌగత సాహా మాట్లాడుతూ, "భారత దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది ప్రపంచంలో అత్యుత్తమంగా ప్రదర్శన చేస్తున్న పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటి. ఇది ఎస్ & పీ గ్లోబల్‌కు అత్యంత ముఖ్యమైన కేంద్రం," అని తెలిపారు.

ఈ కార్యాలయం ఉత్పాదకత, ఉద్యోగుల సంక్షేమం, సుస్థిరతను పెంచేలా ప్రత్యేకంగా రూపొందించబడింది. ఇందులో ప్రాంతంలో మొదటిసారిగా అందుబాటులోకి వచ్చిన అనేక సౌకర్యాలు ఉన్నాయి.

నిలం పటేల్ (మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా) మాట్లాడుతూ, "ఈ కొత్త కార్యాలయం మా 'పీపుల్-ఫస్ట్' దృక్పధానికి ఉదాహరణ. ఆధునిక టెక్నాలజీ మరియు మానవ కేంద్రిత రూపకల్పనతో మా ఉద్యోగులు ఉత్తమంగా పని చేయడానికి సహాయపడుతున్నాము," అని అన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ఇతర కీలక నాయకులు కూడా హాజరయ్యారు, ఇది ఈ హబ్ యొక్క విభాగాల మధ్య ప్రాముఖ్యతను చూపిస్తుంది. గురుగ్రామ్ టీమ్స్ సంస్థ యొక్క వివిధ విభాగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి, అందులో రేటింగ్స్, మార్కెట్ ఇంటెలిజెన్స్, డేటా, ఎనర్జీ, టెక్నాలజీ, ఫైనాన్స్, మార్కెటింగ్ తదితర విభాగాలు ఉన్నాయి. ఎస్ & పీ గ్లోబల్‌కు చెందిన క్రిసిల్ సంస్థ కూడా భారతదేశంలో బలమైన ఉనికిని కలిగి ఉందని నిలం పటేల్ తాము విడుదల చేసినప్రకటనలో తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**